

# నేటి నిజం

తెలుగు దినపత్రిక




website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 20-8-2020 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:16 | పేజీలు: 8 | వెల: రూ.1/-

## తెలంగాణలో మరో 8మంది మృతి

హైదరాబాద్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): తెలంగాణలో గత 24 గంటల్లో కొత్తగా 1763 కరోనా కేసులు నమోదుకాగా.. 8 మంది మృతి చెందారు. జీహెచ్ఎంసీ పరిధిలో అత్యధికంగా 484 కేసులు నమోదయ్యాయి. మేడ్చల్లో 169, రంగారెడ్డిలో 166 మందికి పాజిటీవ్ వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా చికిత్స నుంచి కోలుకుని ఒకరోజు 1789 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఇప్పటి వరకు కరోనా కేసులు 95,700 ఉండగా.. మృతుల సంఖ్య 719కి చేరింది. తెలంగాణలో ప్రస్తుతం 20,990 యాక్టివ్ కేసులుండగా, 73,991మంది రికవరీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 7,97,470 మందికి కరోనా పరీక్షలు జరిగాయి.

## దేశంలో పెరుగుతున్న రికవరీ రేటు

న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): ఇండియాలో కరోనా వైరస్ రికవరీ రేటు పెరుగుతున్నది. దేశంలో వైరస్ నుంచి కోలుకున్నవారి సంఖ్య 20 లక్షలు దాటింది. గత 24 గంటల్లో అత్యధికంగా 60,091 మంది వైరస్ నుంచి రికవర్ అయ్యారు. దీంతో దేశంలో రికవరీ రేటు 73.64 శాతానికి చేరుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ ఇవాళ వెల్లడించింది. ఇక గత 24 గంటల్లో దేశంలో 64,531 కరోనా వైరస్ పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. 1092 మంది గత 24 గంటల్లో మరణించారు. దేశవ్యాప్తంగా కరోనా వైరస్ సంక్రమించిన వారి సంఖ్య 27,67,274కు చేరుకున్నది. దీంట్లో 6,76,514 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. 20,37,871 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఇప్పటి వరకు కరోనాతో ఇండియాలో 52,889 మంది మరణించినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ చెప్పింది.

## అక్కాచెల్లెళ్లలో వాగ్వాదం: కత్తితో దాడి

హైదరాబాద్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): నగరంలోని అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. సూర్యనగర్‌లో నివాసముంటున్న శ్రీనివాస్ అనే మెకానిక్ తన అక్కచెల్లెళ్లతో వాగ్వాదానికి దిగారు. తీవ్రమైన ఘర్షణ చోటు చేసుకోవడంతో కోపంతో ఊగిపోయిన శ్రీనివాస్ కూరగాయల కత్తితో వారిపై దాడికి ఒడిగట్టాడు. ఆపై అక్కడి నుంచి పరారయ్యాడు. స్వల్ప గాయాలైన అక్కచెల్లెళ్లు యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# భారత నౌకాదళం సర్వసన్నద్ధంగా ఉంది

### ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొంటుంది
### నావెల్ కమాండర్ల సమావేశంలో మంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): భారత నౌకాదళ సన్నద్ధతపై తనకు పూర్తి నమ్మకం ఉన్నదని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఎటువైపు నుంచి ఎలాంటి సవాళ్లు ఎదురైనా తక్షణం స్పందించేలా పూర్తి



సన్నద్ధతతో నేవీ ఉన్నదన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ దిశగా యుద్ధ నౌకలు, విమానాలను మోహరించడాన్ని ప్రశంసించారు. ఢిల్లీలోని నేవీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ప్రారంభమైన నావల్ కమాండర్ల సమావేశానికి ఆయన హాజరయ్యారు. దేశ ప్రాదేశిక జలాల రక్షణలో భారత నౌకాదళం పోషిస్తున్న పాత్రను ఆయన అభినందించారు. సున్నితమైన ప్రదేశాల్లో యుద్ధ నౌకలు, విమానాలను మోహరించడం ద్వారా దేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షించడానికి భారత నావికాదళం మిషన్ ఆధారిత విస్తరణను సమర్థవంతంగా నిర్వహిస్తున్నదని రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. ప్రాదేశిక జలాలపై అవగాహనతోపాటు వేగవంతమైన మానవతా సహాయం అందించడానికి ఈ చర్యలు దోహదపడతాయని ఆయన చెప్పారు. కాగా, నేవీ కమాండర్ల సమావేశం మూడు రోజులపాటు జరుగనున్నది. సరిహద్దులో చైనాతో ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో ఈ నేవీ కమాండర్ల సమావేశం జరుగనుంటడం ప్రాధాన్యత సంతరించుకున్నది. గత నెలలో జరిగిన ఎయిర్ కమాండర్ల సమావేశానికి కూడా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు.

# భద్రాచలం వరద ప్రాంతాల్లో ఎంపి కవిత పర్యటన

### -వరద వివరాలు అడిగి తెలుసుకున్న ఎంపి

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): భద్రాచలం పట్టణంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత బుధవారం పర్యటించారు. ముందుగా ఎంపీ భద్రాచలం కరకట్ట ప్రాంతానికి చేరుకొని వరద ఉధృతిని పరిశీలించారు. భద్రాద్రికి పోటెత్తిన గోదావరి వరద వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముంపుకు గురైన రామాలయం పరిసరాల్లో పర్యటించారు. అక్కడి నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన వరద బాధిత పునరావాస కేంద్రాలను ఎంపీ సందర్శించారు. ఆయా పునరావాస కేంద్రాల్లో ఎంపీ కవిత స్వయంగా వరద బాధితులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తెల్లం వెంకట్రావు, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గింది. చివరిదైన మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిలోనే ఇంకా వరద ఉధృతి కొనసాగుతున్నది. వర్షాలకు రెండురోజులుగా విలీన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తగ్గుతూ వస్తున్న ప్రమాదం ఇప్పటి వరకు ఐదడుగుల మేర తగ్గింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పడుతుండడంతో ఉధృతి కొంత తగ్గుతూ వస్తున్నది. కాగా 2013 తర్వాత అత్యంత గరిష్టంగా భద్రాచలం వద్ద గోదావరికి నీరు వచ్చింది. దీంతో ఏజెన్సీ ప్రాంతాలు జలమయమ్మాయి. దాదాపు ఎనిమిది మండలాల్లో వందలాది గ్రామాల్లోకి నీరు చేరింది. అధికారులు స్పందించి ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ముఖ్యంగా భద్రాచలం, పినపాక నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో దాదాపు 60 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు ఐదువేల మందికి పునరావాసం కల్పించారు.

## ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్ రెండోదశ క్లినికల్ ట్రయల్స్

### సరీం ఇండియాతో కలసి ప్రారంభించే అవకాశాలు

న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): కరోనాతో సతమతమవుతున్న భారతీయులకు ఓ శుభవార్త అందనుంది. క్లినికల్ ట్రయల్స్ విజయవంతమైతే ఈ ఏడాది చివరినాటికి అత్యంత సమర్థవంతమైన టీకాల్లో ఒకటిగా భావిస్తున్న ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్ భారత్‌లో కొవిషీల్డ్ అందుబాటులోకి రానుంది. సీహెచ్ఏడీఓఎక్స్ 1గా పిలిచే ఈ ఆక్స్‌ఫర్డ్ టీకా రెండో క్లినికల్ ట్రయల్స్‌ను దేశీయ తయారీదారు సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఈ వారంలో ముంబైలోని కేఈఎం, నాయర్ దవాఖానల్లో ప్రారంభించనుంది. కొవిడ్-19ను అడ్డుకునే సురక్షితమైన, సమర్థవంతమైన వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసేందుకు శాస్త్రీయ ప్రయత్నంలో ఆక్స్‌ఫర్డ్ జెన్నర్ ఇన్‌స్టిట్యూట్, ఆక్స్‌ఫర్డ్ గ్రూప్ పరిశోధకులు ముందంజలో ఉన్నారు. చింపాంజీ అడెనోవైరస్ వ్యాక్సిన్ వెక్టర్ అయిన సీహెచ్ఏడీఓఎక్స్1 వ్యాక్సిన్ కొవిడ్-19కు వ్యతిరేకంగా పనిచేయగల ఆశాజనక టీకాల్లో ఒకటిగా పరిగణిస్తున్నారు. ఎస్ఐఐ దేశంలోని 17 సైట్లలో 18 ఏళ్లు పైబడిన 1,600 మందిపై ట్రయల్స్‌ను ప్రారంభించనుంది. ఈ వ్యాక్సిన్‌ను తయారు చేసి పంపిణీ చేసేందుకు పుణెకు చెందిన ఎస్ఐఐ బ్రిటీష్ డ్రగ్ దిగ్గజం ఆస్ట్రాజెన్కాతో ఒప్పందం చేసుకుంది. అలాగే, భారతదేశం, తక్కువ ఆదాయంగల దేశాలకు 100 మిలియన్ మోతాదుల సంభావ్య కొవిడ్-19 వ్యాక్సిన్ల తయారీ, పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఇటీవల బిల్ / మెలిండా గేట్స్ ఫౌండేషన్, మరియు గవి సంస్థలతో ఎస్ఐఐ అగ్రిమెంట్ కుదుర్చుకుంది. 2020 చివరి నాటికి 400 మిలియన్ మోతాదుల ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్‌ను తయారు చేయాలని యోచిస్తున్నట్లు ఎస్ఐఐ వెల్లడించింది.

## కంటోన్మెంట్ రోడ్డు మూసివేతపై సుప్రీంలో పిల్

హైదరాబాద్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): కంటోన్మెంట్ రోడ్డు మూసివేతపై సుప్రీం కోర్టులో పిల్ దాఖలైంది. సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్ రోడ్డును మిలిటరీ అధికారులు మూసివేయటంపై సీనియర్ సిటిజన్ అనూప్ కుమార్ సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేశారు. కంటోన్మెంట్ రోడ్డు మూసి వేతతో లక్షల మంది ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అనూప్ కుమార్ పిల్‌లో పేర్కొన్నారు. ఇంత మంది ఇబ్బంది పడుతున్నా మిలిటరీ అధికారులు కనికరించడం లేదంటూ పిటీషనర్ తెలిపారు. ఈ పిల్‌ను సుప్రీం కోర్టు విచారణకు స్వీకరించింది. ఇప్పటికే ఇదే అంశంపై రాజ్‌నాథ్ సింగ్‌కు మంత్రి కేటీఆర్ లేఖ రాసిన విషయం తెలిసిందే.

## మంత్రికి కరోనా పాజిటివ్

### క్వారంటైన్‌కు వెళ్లిన సిఎం హేమంత్ సోరేన్

రాంచీ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): జార్ఖండ్ ఆరోగ్య మంత్రి బన్నా గుప్తాకు కరోనా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ముఖ్య మంత్రి హేమంత్ సోరెన్ హోం క్వారంటైన్‌కు తరలారు. రాంచీలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశానికి బన్నా గుప్తా హాజరయ్యారు. కేబినెట్ సమావేశం ముగిసిన మూడు గంటల తరువాత బన్నా గుప్తాకు పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఇప్పటివరకు సీఎం హేమంత్‌కు రెండుసార్లు కరోనా పరీక్షలు చేశారు. నాలుగు రోజుల తర్వాత ఆయన మళ్లీ కరోనా పరీక్ష చేయించుకోనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అంతకుముందు ముఖ్యమంత్రి ఇంట్లో 20 మంది సిబ్బందికి కరోనా సోకింది. సోరెన్ బుధవారం అన్ని కార్యక్రమాలను రద్దు చేశారు. జార్ఖండ్‌లో కరోనా సోకిన రెండో మంత్రి బన్నా గుప్తా. అంతకుముందు తాగునీరు, పారిశుధ్య శాఖ మంత్రి మిథిలేశ్ ఠాకూర్ కూడా కరోనా బారిన పడ్డారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఐదుగురు ఎమ్మెల్యేలకు కరోనా సోకింది.

### చరిత్రలో నేటినిజం



ప్రాభవమును వరస్నాపు...ము
త్రైభవమ్మై అరువదేండ్లు తెలుగుల మదిలో
శోభిల్లగ... కురిసె... కమల
నాభుడు తన దయను "పద్మనాభము" పైనన్!!

( ఆగష్టు 20 పద్మనాభం జయంతి..)



-రాధశ్రీ
సెల్: 9494481210




మహబూబ్‌నగర్ జిల్లా పగిద్యాలలో ఇల్లు కూలి మరణించిన ఘటనలో సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితులను ఓదార్చిన మంత్రి శ్రీనివాసగౌడ్.

# ఇంటి మిద్దె కూలి ముగ్గురు మృతి

### మృతుల కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి గౌడ్

మహబూబ్‌నగర్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): గత వారం రోజుల నుంచి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు మట్టి మిద్దె కూలి ముగ్గురు మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరామర్శించారు. జిల్లాలోని గండీడ్ మండలం పగిద్యాల గ్రామానికి చెందిన శరణమ్మ(35), భవాని(14) వైశాలి(8) తల్లీ, కూతుళ్లు. వీరు నిద్రిస్తున్న సమయంలో వర్షానికి మట్టి మిద్దె కూలి బుధవారం తెల్లవారు జామున ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. కరోనా నేపథ్యంలో పోస్ట్‌మార్టం నిమ్మితం వీరి మృతదేహాలను రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకి తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్ షాద్‌నగర్ దవాఖానకి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. పరిగి ఎమ్మెల్యే మహేష్ రెడ్డి రూ. 60వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో షాద్ నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, కలెక్టర్ వెంకట్రావు తదితరులు ఉన్నారు

# వర్షాల వల్ల నష్టపోయిన అందరినీ ప్రభుత్వం ఆదుకుంటుంది



ములుగు, ఆగష్టు 20: వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల అనేక ప్రాంతాలు నీట మునగడం, వరదల వల్ల ఇబ్బందులు పడుతుండటంతో గిరిజన, స్త్రీ ? శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ములుగు జిల్లాలో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే సీతక్క, జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, కలెక్టర్ కృష్ణ ఆదిత్య , ఏటూరు నాగారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి హన్మంతులతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు.

సమీక్ష అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ములుగులో దాదాపు 150 సెంటిమీటర్ల వర్షాపాతం కురువడటంతో వల్ల ఇక్కడ ప్రజలు ఎక్కువ ఇబ్బందులు పడ్డారు. కావున వారికి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వారికి శాశ్వతంగా పరిష్కారం ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. 6,400 మందిని పునరావాస కేంద్రాల్లో పెట్టి వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఎవరికీ ప్రాణ హానీ కలుగకుండా కాపాడుకోగలిగామని విరించారు.

వర్షాల వల్ల ఇండ్లు కూలిపోయిన వారికి ప్రభుత్వ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ప్రథమ ప్రాధాన్యతగా ఇండ్లు ఇవ్వాలని కలెక్టర్ ను ఆదేశించామన్నారు. అదేవిధంగా వానల వల్ల దెబ్బతిన్న ఇండ్లకు మరమ్మతుల కోసం వెంటనే నిధులు ఇవ్వాలని కూడా చెప్పినట్లు మంత్రి వివరించారు. వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకూడదు, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మంత్రులు, కలెక్టర్లు, అధికారులకు సూచనలు చేస్తున్నారని పేర్కొన్నారు.

ములుగులో రామప్ప, లక్నవరం వంటిపెద్ద చెరువులున్నాయి. వాటికి మరమ్మతులు కావాలని ఎమ్మెల్యే కోరారు. ఇప్పటికే 80 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయి. ఇంకా ఎంత కావాలో అంచనా వేస్తే అవి ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. మిషన్ కాకతీయలో చెరువులను పూడిక తీయడం, కట్టలను పటిష్టం చేయడం కూడా అవి దెబ్బతినకుండా ఉండేందుకు చాలా ఉపయోగపడ్డాయన్నారు. వర్షాల వల్ల పంట నష్టం, రోడ్ల నష్టం, ఆస్తి నష్టం జరిగింది. వీటిని త్వరలోనే అంచనా వేసి పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

రోడ్లు ఎక్కడ దెబ్బతిన్నాయో వెంటనే నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఏ ఒక్కరూ నష్టపోకుండా, ప్రభుత్వం అందరినీ ఆదుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. కరోనా విషయంలోనూ అప్రమత్తంగా ఉంటూ మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. వర్షాల వల్ల ముంపు ప్రాంతాల్లోని వారిని పునరావాస కేంద్రాల్లో సురక్షితంగా ఉంచాలని ప్రయత్నిస్తుంటే..భౌతిక దూరం పాటించట్లేదని కొంతమంది విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# కాబూల్ జంట పేలుళ్లలో ఇద్దరు మృతి

కాబూల్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): అఫ్గనిస్థాన్ రాజధాని నగరం కాబూల్‌లో జంట పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ పేలుళ్లలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. బుధవారం ఉదయం 6.45 గంటలకు పోలీసు వాహనంలో మాగ్నిటిక్ బాంబు అమర్చి పేల్చడం ద్వారా ఓ కానిస్టేబుల్ చనిపోయాడు. మరోక ఘటనలో ఉదయం 8.07 గంటలకు విద్యాశాఖ మంత్రి కారు లక్ష్యంగా చేసుకుని పేలుడుకు పాల్పడ్డ ఘటనలో మరో వ్యక్తి మృతిచెందాడు. మంగళవారం సైతం దేశం 101వ స్వాతంత్ర్య వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న సమయంలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. వాజీర్ అక్బర్ ఖాన్ దౌత్య ప్రాంతం, ఇతర పరిసరాల్లో 14 రాకెట్లతో దాడికి పాల్పడి 10 మందిని తీవ్రంగా గాయపరిచారు. వీరిలో నలుగురు పిల్లలు, ఒక మహిళ ఉన్నారు.

## మరింత విషమించిన ప్రణబ్ ఆరోగ్యం

న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించినట్లు ఆర్మీ రీసెర్చ్ అండ్ రిఫరల్ ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. ప్రణబ్‌కు ఊపిరితుత్తల్లో ఇన్‌ఫెక్షన్ వచ్చినట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయనకు వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతుందని పేర్కొన్నారు.

మెదడులో రక్తం గడ్డకట్టడంతో శస్త్ర చికిత్స చేసిన తరువాత ప్రణబ్ ముఖర్జీ పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. శస్త్రచికిత్సకు ముందు ప్రణబ్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. ఆగస్టు 10న మధ్యాహ్నం ప్రణబ్‌ను దవాఖానకు తరలించారు. ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్య పరిస్థితి గురించి దేశం మొత్తం ఆందోళన చెందుతోంది. ఆయన కోలుకుని వస్తారిన అంతా ఎదురు చూశారు. కూతరు శర్మిష్ట కూడా ఇదే ఆశతో ఉంటూ తరచూ తండ్రి ఆరోగ్యంపై ట్వీట్ చేస్తున్నారు.

## భారత సంతతి వైద్యుడికి సన్మానం

లండన్,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): భారతసంతతి వైద్యుడికి అరుదైన ఘనత దక్కింది. కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు చేసిన కృషికి భారత సంతతికి చెందిన వైద్యుడిని బ్రిటన్ ప్రభుత్వం అవార్డుతో సత్కరించింది. కరోనా పోరులో తమవంతుగా కృషి చేసిన 19 మంది వైద్యులను యూకే రాయల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రెసిడెంట్స్ స్పెషల్ అవార్డ్స్ ఇచ్చింది. ఇలా అవార్డ్స్ అందుకున్న 19 మందిలో భారత్‌కు చెందిన రవి సోలంకి కూడా ఉన్నారు. న్యూరోడెజెనరేటివ్ వ్యాధులపై రేమండ్ సియమ్స్‌తో కలిసి రవి చేసిన మెషీన్ లెర్నింగ్‌లో పనిచేసే ఇంజనీర్ వర్క్ నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్ఎస్) ఛారిటీ హీరోస్ కోసం సురక్షితమైన, పూర్తిగా పనిచేసే వెబ్‌సైట్‌ను నిర్మించడంలో సహాయపడింది. దీంతో వారి స్వచ్ఛంద కృషికి ఈ అవార్డు లభించింది.

## నోయిడా పవర్ స్టేషన్‌లో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): నోయిడాలోని ఓ సబ్‌స్టేషన్‌లో బుధవారం ఉదయం మంటలు చెలరేగాయి. పవర్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పిసిఎల్) లోని 148 సబ్‌స్టేషన్ వద్ద మంటలు వ్యాపించాయి. పవర్‌స్టేషన్ నుంచి నోయిడా మెట్రోకు విద్యుత్ సరఫరాను అందిస్తుండగా ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం వెంటనే సహాయక చర్యల్లో పాల్గొంది. సబ్‌స్టేషన్ మొత్తం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. కొన్ని కిలోమీటర్ల మేర దట్టమైన పొగ కమ్మేసింది. ప్రస్తుతం ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## మరో బెంచ్‌కు మూడు రాజధానుల కేసు

న్యూఢిల్లీ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): ఏపీకి సంబంధించిన మూడు రాజధానుల అంశం మరో బెంచ్‌కు బదిలీ చేస్తున్నట్లు సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. ఈ కేసుకు సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది.

కాగా ఇందుకు సంబంధించి రెండు రోజుల క్రితం జస్టిస్ నారీమన్‌నా బెంచ్‌కు మూడు రాజధానుల కేసును బదిలీ చేయడం జరిగింది. అయితే ఈ కేసులో రైతుల తరుపున నారిమన్ తండ్రి పాలి నారిమన్ వాదిస్తుండటంతో ఆయన విచారణ నుంచి తప్పుకున్నారు. ఈ కేసుకు సంబంధించి విచారణను వేరే బెంచ్‌కు మార్చాలని జస్టిస్ నారిమన్ ఆదేశించారు. దీంతో ఈ కేసు వేరే బెంచ్ కు బదిలీ కానుంది. ఈ నేపథ్యంలో విచారణను మరోసారి వాయిదా వేశారు. కాగా పాలనావికేంద్రీకరణ, రాజధానుల ఏర్పాటు, సీఆర్డీఏ రద్దు చట్టాలపై హైకోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఉత్తర్వులను నిలిపివేయాలని ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

## టీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం

### ప్రమాద బీమా చెక్కును అందచేసిన ఎమ్మెల్యే

నల్లగొండ,ఆగస్ట్19(ఆర్ఎన్ఎ): కార్యకర్తలకు టీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ అన్నారు. పార్టీ కార్యకర్త నర్సింహా ఇటీవల మృతిచెందడంతో ఇన్సూరెన్స్ క్లెయిమ్ అయింది. రూ. 2 లక్షల ప్రమాద బీమా చెక్కుని మృతుడి సతీమణికి ఎమ్మెల్యే నేడు స్వయంగా అందజేశారు. టీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్న పార్టీ కార్యకర్తలకు రూ. 2 లక్షల ప్రమాద బీమా కోసం ప్రీమియం మొత్తం రూ. 16 కోట్ల 11 లక్షల (16,11,19,119) చెక్కును ఇన్సూరెన్స్ కంపెనీకి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవలే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్యకర్తల కృషితోనే టీఆర్ఎస్ పార్టీ అజేయ శక్తిగా ఎదిగిందన్నారు. ప్రతీ ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు.

## మనుషులకు ఊపిరాడటం లేదు..!



– డాక్టర్ కత్తి పద్మారావు
9849741695

మరణం వార్తగా మిగిలిపోయింది
రామమందిరం కర్తవ్యంగా మారింది
భ్రమల్ని విశ్వవ్యాప్తం చేస్తున్నారు
రాజ్యాంగాన్ని చిత్తుప్రతిగా తొక్కివేస్తున్నారు
కొండల మీద నుండి దొర్లుతున్నవారు
లోయల్లోకి పడుతున్నారు
లోయల్లో ముళ్ళ తుప్పలున్నాయి
శరీరం అంతా రక్తసిక్తం అయ్యింది
ఒక్కొక్క ముల్లు తీస్తున్నప్పుడు ఒక అరుపు
పతనం భౌతికమే కాదు
జాతిపరంగానూ జరుగుతుంది
మరణం వాకిట ముందు నిలబడి ఆహ్వానిస్తుంది
జాతిని రక్షించలేనివాడు పాలకుడెలా అవుతాడు?
కోట్లకు పడగలెత్తినవారు
స్విమ్మింగ్‌పూల్‌లో మునకలేస్తున్నారు
ఫామ్‌హౌసుల్లో కొండశిలవల్లా
చెట్లకు పెనవేసుకొంటున్నారు
ఆ శిశువు ఊపిరందక బేలగా చూస్తుంది
తల్లి ఆక్రందనను వినేవారు లేరు
పాలకులు రామకథ వర్ణిస్తున్నారు
అశక్తులు వేదాంతులవుతారు కదా!
జీవితం అంటే వాస్తవం
ఆక్సిజన్ ప్రకృతి జన్యం
ప్రకృతిని విధ్వంసించాక
ఊపిరి ఎక్కడనుండి వస్తుంది
మనుషులు స్వార్థపరులయ్యేకొలది
ప్రకృతి వికృతి అవుతోంది
ఆ హెూటల్లో మనుషులు మాడి మసి అయ్యారు
పాలకులు అంధులయ్యారు
ఆ ఆత్మహత్య వెనుక ఆర్థిక లావాదేవీలున్నాయి
పులులు మేకల రూపంలో సంచరిస్తున్నారు
మృతదేహాల వెనుక అనేక కథనాలు
ఉరి ఎందుకు వేలాడుతుంది
కోరికలు మితిమీరాయా..!
బొమ్మ ఏదైనా మసకబారవలసిందే
దాని రంగులు దాని బాహ్యాన్ని మాత్రమే చూపిస్తున్నాయి
దాని అంతరంగాన్ని చూపే రంగు లేదు
జీవితాలు రంగుల వలయాల మధ్యలో ఛిద్రమవుతున్నాయి
మీరు గొప్పవనుకున్న దేశాలు
ఇప్పుడు మరణ మృదంగాన్ని మోగిస్తున్నాయి
మీ మోసాలకు, చిందులకు నెలవైన పబ్బులిప్పుడు
చీకటి గుహలయ్యాయి
మీరు ఈ దేశంలోని ప్రకృతి లావణ్యాలను వదిలేసి
న్యూజిల్యాండ్, స్విట్జర్ల్యాండ్ పరుగెత్తారు
మీరు ఆశ్రయించిన విమానయానాలు
ఇప్పుడు రన్‌వే మీద కుప్పకూలుతున్నాయి
మనుషులు తమ మీద విశ్వాసాలను
తమ నేల మీద విశ్వాసాన్ని కోల్పోయారు
అనాథ శరణాలయాల్లో ఎవరో బొమ్మలు గీస్తున్నారు
వృద్ధాశ్రమంలో రాలుతున్న ఆకులు
ఆస్థిని అనుభవించి నెట్టివేస్తున్న పుత్రులు
మస్తకం నశించాక తోలుతిత్తేగా మిగిలేది
వాడు ఎందరితోనే సహకరించాక
పెళ్ళివేడుక చేస్తున్నారు
నీతి తప్పాక అన్నీ పండుగలే
వాళ్ళు ఆరుగురు పిల్లలు
మనవళ్ళు, మనవరాళ్ళు రెండు పదులు
ఆమె వృద్ధాశ్రమంలోకి నెట్టబడింది
మానవత్వం హరిస్తున్నచోట
మమతల వృక్షాలు ఎలా మొలుస్తాయి
ప్రకృతి స్థంభించిది
ఆక్సిజన్ తగ్గిపోయింది
జనానికి ఊపిరాడటం లేదు
అందుకే, కరుణ సంద్రాలు పొంగాలి
ఆకాశ నక్షత్రాలు భూమికి దిగాలి
నేలలో జ్ఞానజ్యోతులు వెలగాలి
బుద్ధుడు నడిచిన నేలలో
జీవన ప్రభాతాల ప్రజ్వలనం ఒక వెల్లువ కావాలి
ప్రేమ వృక్ష ఫలాలే సజీవ కృతులు..

(విజయవాడ స్వర్ణప్యాలెస్‌లో ఆగష్టు 9, 2020న
కరెంట్ షార్ట్‌సర్క్యూట్‌లో మృతిచెందిన
కరోనా మృతుల స్మృతిలో)

పుస్తక సమీక్ష

# “లాక్ డౌన్ వెతలు ? మరి కొన్ని కతలు”

“కడుపు కోసమే కదా మేడం వాళ్ళు బయటకు పోయేది. ఆ కడుపు నిండితే ఎందుకుపోతారు మేడం!”






### సంధికాలంలో సామాజికత, మానవస్వభావ చిత్రణ

సాహితీ విదుషీమణి అత్తలూరి విజయలక్ష్మిగారు తెలుగు పాఠకులకు చిరపరిచితురాలు. “అపూర్వ” “ అపురూప” కథా రచయిత్రి. ఇరవై ఒక్క నవలలు రాశారు. అసంఖ్యాకంగా నాటికా, నాటకాల్ని రాయటమే కాక, ప్రదర్శన, నిర్వహణ, దర్శకత్వ బాధ్యతలను విజయవంతంగా నెరవేర్చిన దీక్షాదత్తత కలిగిన కార్యశీలి. ఆమె పొందిన పురస్కారాలు, సత్కారాలూ, బహుమతులూ ప్రత్యేక పట్టికే! విజయలక్ష్మి గారు సాహిత్యంలో కొత్తదారిని ఎన్నుకోవడంలో పేరు పొందినవారు. ఆమె రచనల్లో వినూత్నత ఆమె అభిలాషకు మాత్రమే కాక, రచనపట్ల ఆమెకు గల ఆరాధనాభావానికీ, నిబద్ధతకూ కూడా నిదర్శనం. ఇదుగో “ లాక్ డౌన్ వెతలు ? మరికొన్ని కతలు “ కథా సంపుటి ఈనాటి దృష్టాంతం!

ప్రపంచ చరిత్రగతినే మార్చి, ఊహాతీతమైన విలయాన్ని సృష్టించి, ఇంకా మానవాళిని వణికిస్తున్న మహమ్మారి కరోనా. ప్రజల్ని భౌతికంగా, మానసికంగా అతలాకుతలం చేస్తున్న దురవస్థ ఈనాటి సందర్భం. ఈ దురవస్థల్లోని వివిధ, విభిన్న పార్శ్వాల్ని అక్షరీకరించారు విజయలక్ష్మిగారు. ఆ అక్షరీకరణలో వైవిధ్యంతో పాటు ఆర్ద్రత, మానవమనస్తత్వ, స్వాభావికతా కూడా ఈ రచనని ఉత్తమంగా నిలుపుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల “లాక్ డౌన్ (!) ఇక్కట్లను వాస్తవికంగా ఆవిష్కరించారు రచయిత్రి.

### ఇవన్నీ కథా,కథనాలు !!

విజయలక్ష్మిగారు చింతనపరురాలు కావటంతో ఈ దుర్భర లాక్ డౌన్ లో మనమందరమూ అనుభవిస్తున్న కష్టపరంపరల నీడల్ని, క్రీనీడల్నీ , జాడల్నీ, చరుపుల్ని, అరుపుల్ని భిన్న, భిన్న కథన రూపంలో చిత్రించారు. ఈ చిత్రణలో అంతర్వితంగా ఉన్న సంవేదనకి ముందుగా మనమందరం ఆమెకు మన సహానుభూతినీ, అభినందనలనీ అందించాలి. (బహుశా ) తెలుగులో మొట్ట మొదటి లాక్ డౌన్ కతల సంపుటి ఇదేననుకుంటాను. !

ఆ ఇంటికి “అనుకున్న అతిథి” చుక్కమ్మ. మధ్యాహ్నం మూడు గంటలయ్యేసరికి వచ్చి స్వప్న పెట్టింది తిని వెళ్తుండేది. కరోనా కాలం... దాంతో ఆమె చాలా రోజులుగా రాలేదు. స్వప్న ఆమె గురించి ఆలోచిస్తూ ఉండగా ఆవాళ వచ్చింది. మాట కలిపింది స్వప్న. కరోనా గురించి, తీసుకోవలసిన జాగ్రత్తల్ని చెప్పింది. దానికి ప్రతిగా చుక్కమ్మ అంటోంది, “ మమ్మల్నెవరు ముట్టుకుంటరు బిడ్డా! బీమారీలు కూడా ముట్టుకోవు. తాగనీకి గుక్కెడు నీల్లిచ్చేతోల్లు లేరు. సేతులు కడగనీకి యాడికెల్లి వస్తయ్. మా బతుకులు ఇట్లనే అయిపోతయి ” అర్థమైంది కదా! కథానికలలో సామాజికత అంటూ పేజీలు పేజీలు మనుషుల జీవిత చరిత్రల్ని కథాగతంగా పులిమేస్తున్న సాహిత్య సందర్భాన్ని గమనిస్తున్నాం. పైన చెప్పిన రెండు పేజీల్లో కథానికా లక్షణాల్లో ఏ లక్షణం (సాంకేతికత గురించి మాట్లాడే పెద్దలు) లేదో చెబితే ఆలోచించుకోవచ్చు!

కథానిక అందిస్తున్న అనుభూతికే పెద్దపీట “పూవంటి మనసు” అని మరో కథనంలో పూలు దొరకని కాలంలో నలభై ఏళ్ల నుంచీ మోండా మార్కెట్ లో పూలమ్ముతున్నాయన కొడుకు ఉమర్ అంటున్నాడు. “మీరు మా గురించి భయపడతారు. మమ్మల్ని తిట్టుకుంటారు అని నాకు తెలుసు మేడం. మా వాళ్ళు కొందరు మూర్ఖులు మేడం. మా బస్తీలో నేను, మా అన్న ఇంటింటికీ వెళ్లి సోషల్ డిస్టెన్స్ పాటించకపోతే ఏమవుతుంది అన్న సంగతి రోజూ చెప్పాము కొన్ని రోజులు. ఇప్పుడు ఎవరూ బయటకు రావడం లేదు మేడమ్. ఇంకా మేము పదిమందిమి రెండు గ్రూప్స్ గా ఏర్పడి మా బస్తీలో పేదవాళ్ళకి ఫుడ్ ఇస్తున్నాము మేడం. కడుపు కోసమే కదా మేడం వాళ్ళు బయటకు పోయేది. ఆ కడుపు నిండితే ఎందుకుపోతారు మేడం!” ఇదీ ముగింపులోని ఒకటి రెండు వాక్యాల్లో కథ మొత్తాన్నీ ఆలోచనాత్మకం చేసే విజయలక్ష్మిగారి రచనా శిల్పంలోని మెరుపు. ఈ కథనాలన్నిటిలో కనిపించే గుణ విశేషం ఇది “మనిషి” అని చాలా మంచి కథ ఉన్నది. హాస్టల్ లో ఉండే చిన్న ఉద్యోగులు, స్టూడెంట్స్ , చిరువ్యాపారాలు వగైరా ? హాస్టల్ లో ఉండలేరు, బయటికిపోలేరు. యజమానికి డబ్బు కట్టకపోతే, బయటకు వెళ్లిపొమ్మని చెప్పడం ...వాళ్ళ సమస్య వాళ్ళది ... ముఖ్యంగా తిండి ఏర్పాటు. ఇదొక catch to catch దుస్థితి! దీన్ని నేపథ్యంగా తీసుకుని ఒక యువకుడు, ఒక అసహాయ వృద్ధురాలిని మానవీయంగా ఆదుకున్న సంఘటనని ఇతివృత్తంగా మలిచారు రచయిత్రి. మంచి కత. ఇలా చిత్ర, విచిత్ర, వైవిధ్య భరితమైన వాస్తవాలు!

కాగా, ఈ సంపుటి పేరు “లాక్ డౌన్ వెతలు” మాత్రమే కాదు,” మరి కొన్నికతలు “ కూడా! ఆ మరికొన్ని కతలులో రెండు కథల్ని తప్పకుండా ప్రస్తావించాలి. కారణం ఇవి తెలుగు కథా సాహిత్య చరిత్రకారులు తప్పకుండా గుర్తుంచుకుని రికార్డు చేయవలసిన కథలు కనుక. ఒకటి “పోటీ”. రిపబ్లిక్ డే .. కాలనీలో పోటీలు.. పిల్లలకీ, పెద్దలకీ. స్త్రీలకీ,, పురుషులకీ, ముగ్గుల పోటీకి ఎన్ని పిలుపులిచ్చినా వెంటనే ఎవరూ ముందుకు రాలేదు. ఒక యువతి మాత్రం వచ్చింది. ఆ వరుసలో ఇంకా కొందరు వచ్చారు. ముగ్గులు వేశారు. బహుమతుల్ని ప్రకటించింది ఆమె. మొదటి బహుమతి మొదటగా రంగు డబ్బా పట్టుకుని వచ్చిన యువతికి ఇచ్చింది . ఆ యువతి వేసింది ముగ్గు కాదు కదా అని టెక్నికల్ పాయింట్ తెచ్చింది ఒకావిడ. దానికి ఆమె చెబుతోంది “ పోటీలు పెట్టింది వాళ్ళల్లో సెల్ఫ్ కాన్ఫిడెన్సు రావాలని అని మీరే చెప్పారు కదా! ఆ అమ్మాయిలోని ఆత్మవిశ్వాసానికి ఇచ్చాను అన్నది. ఇంతకీ ఆ పిల్ల వేసిన ముగ్గు మువ్వన్నెల జెండా! ఇంతకన్నా మరీ గొప్ప కథ “నడిచే పూలవనం” ఎప్పుడూ కళకళలాడుతూ, పచ్చగా, నిండుగా పెరడులో తిరుగుతూ ఉండే పొరుగింటి ఆవిడని చూస్తే ఈమెకు అసూయ, అకారణమైన ఈసు. మానసికంగా ఆమెకే కష్టమన్నా వచ్చి, ఆ కళకళని దూరం చేస్తే బాగుండుననే చిత్త వైకల్యం. ఆమె ఎదురు చూసిన సందర్భం వచ్చింది. అపురూపమైన సన్నివేశం! ఆమె ఏడుస్తూ కన్నీటి సంద్రంగా మారి వచ్చి, తాళం చెవి ఇస్తూ, “ మా పిల్లలు వస్తే ఇవ్వండి ఆయన్ని అర్జంటుగా హాస్పిటల్ కి తీసుకు వెళ్తున్నాను. ఆయనకి కాన్సర్. చెయ్యని పూజ లేదు, కానీ పరిస్థితి విషమించింది. తర్వాత మాట్లాడతాను” అంటూ వెళ్ళిపోయింది. ఈమెకి నిజానికి ఆనందంతో గంతులేయాల్సిన మహత్తర సన్నివేశం .. కానీ “ ఎందుకో నా మనసులో ఒకటే ఆలోచన... దేవుడా ఆమెని ఎప్పుడూ నడిచే పూలవనం లాగే ఉండనీ!” అనే వాక్యాలతో కథని ముగించారు రచయిత్రి. నేను చాలా చాలా రోజులు ఆలోచిస్తూ కూర్చున్నానీ కథ చదివి. రెండు విషయాలు నన్ను మరీ ఆరడి పెట్టాయి. ఇంత గొప్ప మనస్తత్విక కథని ఇంత క్లుప్తంగా ఎంత శిల్పభరితం చేసిందా విజయలక్ష్మిగారు అనేది ఒకటి. రెండవది స్త్రీ సహజమైన (కొందరిలో) అసూయా భావానికి ఇచ్చిన మలుపు. ఈ మలుపుని “ఎపిఫినీ “ అంటారు సాహిత్యకారులు. నేను అద్భుత వాస్తవం అంటాను. ఇది మనకేమి కొత్త కాదు. పురాణేతిహాసాల్లో, జానపద గాథలలో శతాబ్దాలుగా మనం చదువుకొన్నదే! ఈ మలుపు కథకి మొత్తానికి ఇరుసు వంటిది. ఈ అద్భుత వాస్తవం ఒక సహజ, స్వాభావిక, మనస్తత్విక పరిణామం. దీనివలన కథ చిరకాలం చదువరుల మననంలో నిలుస్తుంది. దాన్ని మళ్ళీ, మళ్ళీ గుర్తు చేసుకోనేటట్టు చేస్తుంది. ఆ విధమైన వెంటాడే ముగింపుతో ఉన్న విజయలక్ష్మి గారి ఈ కథ ఒక ఆణిముత్యం. కథానికాభిమానులు పదుగురి ముందుకు తీసుకు వెళ్ళవలసిన మంచి రచన. ఈ కథా సంపుటి విజయలక్ష్మి గారికి రచన పట్ల గల నిబద్ధతని, మరోమారు వెల్లడి చేస్తున్నది. వస్తురూప మేలిగుణాలతో వెలువడిన “లాక్ డౌన్ వెతలు ? మరికొన్ని కతలు “ చదవండి రచయిత్రికి అభినందనలు . ఆమె సామాజిక, సాహిత్య బాధ్యతా నిర్వహణకి జయహో!

ప్రతులకు: నవోదయ, కాచిగూడ
తెలుగు బుక్ హౌస్
నవచేతన, విశాలాంధ్ర
అన్ని పుస్తక బ్రాండీలు.



-విహారి
9848025600

## చిట్టితల్లి జాగ్రత్త ..!

ఆ చీకటి గుహను నక్షత్రాల వెలుగులు తాకకపోయినా
ప్రేమతో తన ఉదరాన్ని సుతారంగా ఓసారి స్పృశించినా చాలు
నీకు నేను ఉన్నాను అనే భరోసా తొమ్మిది నెలల నిర్బంధాన్ని
సునాయసంగా దాచేందుకు సహాయపడుతుంది .
ఒక్కసారిగా బయట ప్రపంచాన్ని చూసి ఉలిక్కి పడ్డ పసి ప్రాణాన్ని
తన గుండెలకు హత్తుకుని నీ కంటే నాకు ఏది ముఖ్యం కాదని
తన్మయత్వంతో మైమరిచి పులకరించిన తల్లిఆత్మీయ స్పర్శ .
అనుబంధాల పొదరిల్లుకు తొలి పాదుపెడుతుంది.
ఇంత ఇంతగా పెరిగి మొగ్గ పువ్వుగా మారినట్లు వయసు పెరిగేకొద్దీ
కొన్ని కళ్ళు కాటువేసే ప్రయత్నంలో నీ చుట్టూ తచ్చాడుతుంటాయి.
ఆశ చూపించి ఏదో కావాలని నిన్నుమభ్యపెడతాయి .
మగవారి రూపంలో ఓ చెడ్డ స్పర్శ నిన్ను ముట్టుకొని
రాక్షస ఆనందాన్ని పొందే ప్రయత్నం చేస్తుంది.
చిట్టి తల్లి ... జాగ్రత్త ...! నీ రక్త బంధము ,
దగ్గర సంబంధం బడిలో, గుడిలో,
ఎవరి రూపంలో అయినా నీకు అపాయం పొంచి ఉంది.
ఉపాయంతో నిన్ను నీవు రక్షించుకోవాలి.
ఆత్మీయతో కూడిన స్పర్శకు, అనర్థాలకు దారితీసే నీచుల స్పర్శకు ఉన్న తేడాను
తెలుసుకుని భవిష్యత్తు పునాదులు నిర్మించుకో..
సాటిలేని చరితకు చరణమై సాగిపో..!



-షేక్. నసీమా బేగం
9603567011

## సతత హరితం

లెక్కేసుకుందుకు చుక్కలు కూడా సరిపోవు మరి
ఎన్నివేల కాంతి సంవత్సరాలుగానో
తేనె తలపుల్లో ఊరి ఊరి మధురమైన ఊహలు ఇవి
మధుమాసాలు నిచ్చెనగా అమర్చుకు
నీలాకాశం అనంతమై నాలో పల్లవించిన క్షణాలు మరి.

పచ్చపచ్చని పూపొదరిళ్ళురెక్కలు వచ్చిన చిలుకలై
ఎగురుతున్నట్టు వెచ్చని పలుకుల పలకరింపు
ఎంతో నచ్చిన నీరెండ వెలుగులో ముళ్ళ గోరింట
పూల వాన పసిమి ముత్యపు జల్లులా ఒక తలపు

మిట్టమధ్యాన్నపు గ్రీష్మామారుణ మంకెనపూల్లా
ఎఱ్ఱెర్రని అక్షరాలు ఎందుకో గాని సుతరామూ నచ్చవు
సుకుమారపు వసంత గాలిలా ఓ సారి వీచి పోయే

క్షణికపు జీవితాన అక్షయ తూణీరాల్లా
ఎదురుదెబ్బలై రాక్తం చిందించే పరిచయాలు

అయితేనేం
చెరుకు నాటిన చోట తీపి రసమే కాని
వేప చేదుకు తావెక్కడ?
పచ్చదనమే కదా పదిమందికి అన్నం పెట్టేది
వెచ్చని రక్తం చిమ్మే కత్తుల పదును కాదు.



-స్వాతీ శ్రీపాద
8297248988

## నేటి నిజాలు




పుస్తక సమీక్ష

# వేదోపనిషత్తుల జ్ఞానదీపిక “చింతన”






మన భారతీయ వాఙ్మయం ప్రాచీనమైనది. సనాతనమైన ఎన్నో ధార్మిక విషయాలను, క్రమశిక్షణ గలిగిన జీవనవిధానాన్నీ అది ప్రతిబింబిస్తుంది. వేదాల దగ్గర నుంచీ నేటి వరకు మనసా వాచా కర్మణా అనే త్రికరణయుక్తంగా ప్రజలు జీవించాలనీ ప్రబోధాలెన్నో ఋక్కులరూపంలోనూ, సూక్తులరూపంలోనూ,ఉపనిషత్తుల రూపంలోనూ వెల్లడయ్యాయి. అయితే అవి సంస్కృతభాషలో వుండటం వలన సాధారణ తెలుగుప్రజలకు చేరువ కాలేక పోయాయి. అయితే అనువాదాల రూపంలో రచనలు వచ్చాయి. అయినా వాటిలోని మౌలిక విషయాలకు, పరమార్థాలను సులభ భాషలో ప్రకటితం కాలేదు. ఈ విషయాన్ని గమనించి, ఆచార్యులు మసనచెన్నప్ప గారు భారతీయ తాత్వికతను ప్రాచీన గ్రంథాల్లోంచీ అంశాలవారీగా విభజించీ వచనీకరించారు. అదే “చింతన” పుస్తకంగా మన చేతుల్లోకి వచ్చింది.

మసన చెన్నప్ప గారు వేదాలు,ఉపనిషత్తుల దగ్గర నుంచీ ఆధునిక సాహిత్యం వరకు నిశితమైన దృష్టీ, అవగాహన కలవారు.దరిదాపు 30 దాకా రాసిన పుస్తకాల్లో పరిశోధన, కవిత్వం,విమర్శ,యాత్రాచరిత్ర,కాలమ్ ,నాటిక,పద్యం, గేయం ఇలా అనేక ప్రక్రియల్ని పరిమళభరితం చేసిన ప్రతిభమతి ఆయన. విస్తృతమైన అధ్యయనం,సృజన,విశ్లేషణ త్రయంగా అలుపెరగని కృషిని చేసే సాహితీసేవకులు. ఇప్పటి ఈ పుస్తకం లోని ఆధ్యాత్మిక వ్యాసాలన్నీ నమస్తే తెలంగాణ పత్రికలో ధారావాహికంగా వచ్చినవి. పురుషార్థాల సాధనకు, మోక్ష కాంక్షితులకు ఈ వ్యాసాలు దారిదీపంలా తోడ్పడతాయి.

ఇవాల్టి కాలంలో మనుషులంతా ఉపరితల మేధావులై తలాతోకా లేకుండానూ, తలతిక్కగానూ నడుస్తున్నారు. అర్థం పర్థం లేని బతుకులు,వ్యర్థంగా గడిపేసే బతుకులే ఎక్కువ. వీళ్లు మనసుపెట్టి ఈ పుస్తకాన్ని చదివితే, నిజంగా ఒక జన్మ కాలంలోనే సజ్జనులై,సార్థకమతులై విలసిల్లుతారు. ఈ రచయిత “ఆత్మజ్ఞానమే జీవనసాఫల్యం” అనే వ్యాసంలో ఆత్మసంబంధ విషయాలను వివరించారు.

”ఆత్మజ్ఞానం యోగం వల్ల సిద్ధిస్తుంది. యోగసాధన వల్ల మోక్షం లభిస్తుంది.ఆత్మ నిత్యమైంది.శరీరం అనిత్యమైంది. దేహం అద్దెకు తెచ్చుకున్నది.జ్ఞానం చేతనే ముక్తి.మనుష్యుడు ఎప్పుడైతే ఆత్మావలోకనం చేయగలుగుతాడో, అప్పుడే పరమాత్మ సాక్షాత్కారం లభిస్తుంది.మోక్షమంటే జీవన సాఫల్యమే. జీవనసాఫల్యమంటే ఆత్మజ్ఞానమే”.

అలతి అలతి పదాలతో లోతైన ప్రాచీన ఋషుల ఉపదేశాలను మనకందించారు.మరో వ్యాసంలో నాలుగు రకాల కాలుష్యాలను గురించి చెప్పారు. ఈర్ష్య, అపకారబుద్ధి, అసూయ,అసహనం అనే కాలుష్యాలను పతంజలి యోగదర్శనంలో పేర్కొన్నాడు. ఈ కాలుష్యాలు త్రికరణ శుద్ధికి ఆటంకాలనీ, వీటిని దూరం చేసుకుంటేనే మనిషిలో చిత్తప్రసన్నత ఏర్పడుతుందనీ వ్యాఖ్యానించారు. బుద్ధి ఏకాగ్రం కావడానికి ఆత్మకాలుష్యాలను రూపుమాపాలన్నారు.

నేటి కాలంలో గ్రంథపఠనం తగ్గిపోయింది. అందుకే జీవన మూల్యాలు తగ్గుతున్నాయి. పెద్ద పెద్ద గ్రంథాలు చదవలేక పోయినా,ఇలాంటి చిరుపుస్తకాలనైనా చదివితే మన దేశీయ మైన అపురూపజ్ఞానం పరిచయం కాగలదు. వ్యాసాల్లోని విషయాలను వరసగా రాస్తాను.

1.”శరీరం రథమైతే బుద్ధి సారథి.జీవుడు శరీరమనే రథానికి స్వామి మాత్రమే. బుద్ధే అతడిని నడిపిస్తుంది. సారథి రూపంలోని బుద్ధి వక్రంగా సాగితే శరీరపథం కుంటుపడుతుంది.సక్రమంగా సాగితే గమ్యం చేరుతుంది”

2.”గుణమంటే తాడు అని అర్థం.మనం రూపం మొదలైన గుణాలతో బంధింపబడి వున్నాం.వాటిని వదిలించుకోవడం అంత సులభం కాదు. మనల్ని ఆశ్రయించి, మన చేత సుఖదుఃఖాలను అనుభవింపజేసేవీ గుణాలే”.

3.”లౌకిక సుఖాలకంటే భిన్నమైన ఆనందాన్ని ఇచ్చేవాడు ఒక పరమాత్మ మాత్రమే”.

4.”మనం ప్రేమించే ప్రాణిలోనే కాక, మనం ద్వేషించే ప్రాణిలోనూ భగవంతుడున్నాడు”

5. “అనువ్రతః పితుః పుత్రో మాతా భవతు సంమనాః” అనగా పుత్రుడు గానీ పుత్రిక గానీ తండ్రికి తగినవారు అనిపించు కోవాలి. తల్లితో సమానమైన హృదయం కలిగి ప్రేమను పంచుకోవాలి”.

మసన చెన్నప్పగారు రాసిన ఈ చింతన లోతైనదీ, విస్తారమైనదీ, ఈనాడు పెడధోరణులు పోతున్న యువతకు ఎంతో అవసరమైనదీ. మొక్క దశలో ఇలాంటి సన్మార్గ ప్రబోధాలను వింటే మనుషులంతా దేవుళ్లే అవుతారు. విలువైన పుస్తకాన్ని అందించిన రచయితకు అభినందనలు.

ప్రతులకు..
ఉదయనగరు కాలనీ,
బోడుప్పల్ ,
హైదరాబాదు...500092
సెల్ ...9885654381



-మెట్టా నాగేశ్వరరావు
సెల్: 9951085760

## ఆశావాది

రాత్రంతా నిదుర లేని ఆకాశాన్ని
ఆశావాదివి కమ్మంటే
కమ్మని కలగన్నంత సులభమా అంటోంది..
అయితేనేం అనంతమై ఆకాశం
అమ్మఒడిలో కబుర్లు విన్నట్టు
కళ్ళుపెద్దవి చేసి మరీ చూస్తాను..

బద్ధకంగా కళ్ళుతెరిచిన నగరాన్ని
శుభ్రం చేస్తూ వానజల్లు
శుభోదయం పలుకుతోంది
వానచినుకెప్పుడూ కొత్తపలుకే
కొత్తింటి తలుపులా మెరుస్తుంటుంది
వాడని తలపులా తళుక్కుమంటుంది.

నాలుగునెలల కొవిడ్ సహజీవనం
జీవితాన్ని కొలవటం నేర్పింది
బతుకు మారింది..
గమనం మారింది..
నిష్పూచీగా నిష్ఠూరమాడే
మనుషులేమయిపోయారో
బెంగగా ఉందనుకుంటూ
ఆకాశంవంక చూశాను
రాత్రి అలజడిని కడిగేసి నిర్మలకాంతితో
ఇప్పుడు ఆశావాదినయ్యాను మిత్రమా అంటోంది..
కట్టడి చేసే ఆలోచనలను పీకేస్తూ
ఆశకు అంటు కట్టడం మొదలెట్టాను.



-సి.యస్.రాంబాబు
8374818961

## మేడిపండు చదువులు

దేశ ప్రగతి స్ఫూర్తిని నిర్వీర్యం చేస్తున్న
నిర్లక్ష్యపు రాచపుండ్లు
చూపులకు ఏపులా ఉన్న మేడిపండ్లు
నేటి చదువులు.
ప్రక్షాళన లోపమా?
నిరర్థక పథకాల ఫలితమా?
తగ్గింది నేడు చదువుకోవడం
పెరిగింది
'చదువు'తో పాటు ఉద్యోగాలూ కొనడం.
'పట్టా' కు ఉన్న ప్రాముఖ్యం
చదివిన దానిపై ఉన్న
'పట్టు' కు లేదు.
'సున్నా' ను కనిపెట్టిన దేశంలో
నేడు చదువుల విలువలకు
'సున్నా' తో శఠగోపం.
ఏళ్లు గడుస్తున్నా
ఆదరణ కోల్పోతున్న ప్రతిభ
కొరవడుతున్న సృజన శీలత.
ప్రాథమిక దశ నుండి పైస్థాయి దాకా
బోగస్ బోధకులు.
తీరు మారని ధృతరాష్ట్ర నిర్వహణ
పడకేస్తున్న విద్యాలయాలు.
దేవతా వస్త్రాలుగా మారుతున్న
విద్యా ప్రమాణాలు.
ఎందుకూ కొరగాకుండా పోయే ప్రమాదంలో
రేపటి తరాలు.



-ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## చీకట్ల అలముకున్న...!!

నా చిన్న గుండె గూటిలో
ఎన్ని జ్ఞాపకాలు గుళ్ళు కట్టుకున్నాయే
ఎన్ని కలతలు అక్షరాలను అల్లుకున్నాయే
చేదు జ్ఞాపకాల వలలో చేపలు ఎన్ని పడ్డాయో

బాల్యములో చిగురించిన ఆశలెన్నో
యుక్తవయసులో పరుగు పెట్టినా
వయసు గుర్రంలా విజయం కోసం వెంట పడ్డ మనసు
స్వప్న సాగర తీరాన మునకలు వేసిన
ముత్యాల కోసం ఆరాటమే తప్ప
మునిగిపోతాం అన్న భయం వేసింది కాదు

కాలం ఒకలా సాగలేదు
ఓడలు బండ్లు బండ్లు ఓడలు అయినట్లు
సంసార సాగరం ప్రయాణం రోడ్డుమీద
ఈత కొడుతున్నట్లు ఉంది ఇప్పుడు
మానవత్వం లేని తిమింగలాలు
రహదారి వెంబడి మింగుతున్నాయి
ఉన్న వారిదే అనుభవం అన్నట్టు
లేని వాడే చిన్న చేపల్లా కొట్టుకుంటున్నాడు

చీకట్లు అలుముకున్న జీవితం
చీకటిలో చిరుదీపం
గాలిలో దీపం పెట్టినట్లు
గాలి పెద్దదైతే ఆరిపోతుంది
చిన్నది అయితే నిలబడి
చుట్టూ ప్రసరిస్తూ వెలుగును నింపుతుంది
ఏ తీరుగా విస్తుందో గాలి
నీటి బుడగ లాంటిది జీవితం పై..!!



-కొప్పుల ప్రసాద్
9885066235

## స్నేహం

కులము మతము చూడదు స్నేహం
ఆస్తులు అంతస్తులు చూడదు స్నేహం
నిన్ను నిన్ను గా చూసేది స్నేహం
కష్టాలు కన్నీళ్లు తీర్చేది స్నేహం
బంధువుల కన్నా మిన్నది స్నేహం

ఆపదలో ఆదుకునేది స్నేహం
నీ క్షేమాన్ని ఉన్నతిని కోరేది స్నేహం
నీ భయాన్ని రూపుమాపేది స్నేహం
నీకు ధైర్యాన్నిఇచ్చి దారిచూపేది స్నేహం
అన్ని వేళలా అండాగానిలిచేది స్నేహం

నిరాశ లో ఆశాదీపం వెలిగించేది స్నేహం
నేనున్నాను అంటూ భుజం తట్టేది స్నేహం
ఏత్యాగానికైనా సిద్ధంగా ఉంటుంది స్నేహం
కడదాక నిన్ను నీడలా వీడనిది స్నేహం
ఒరేయ్..ఏరా..అనే పిలుపులో ఉంది స్నేహం



-బూర దేవానందం
9494996143

## వాడికెందుకో మరి?

వాడి ముఖంలో ఎరుపేందుకు?
వాడెప్పుడో వేసిన తెల్లచొక్కా
పెద్దయ్యాక ఇప్పుడేగా వేసింది నేను?

వాడి మాటలో విరుపెందుకు?
వాడెప్పుడో చదివిన ఇంగ్లీష్
నేనిప్పుడు చదువుతుంది?

వాడి చూపులో కోపమెందుకు?
ఎప్పుడో రుచి చూసిన ఆనందమేగా
నేడిప్పుడు రుచి చూసింది?

వాడిలో నేను
ఎప్పుడూ చూసేదిగా ?
వాడు ఇప్పుడు నాలో చూస్తున్నది.
వాడికెందుకో మరి ?

వాడిలో ఉన్న నేను కొద్దిగా మారితే
నాలో ఉన్న వాడికి ఓర్పే లేకపోతే తప్పెవరిదో?...
వాడి కన్నుదా? నా చూపుదా?శిక్షవరికో ?
నా కులానికా? వాడి అహానికా?



-చందలూరి నారాయణరావు
సెల్..9704437247

## స్నేహ మాధుర్యం

స్నేహమనే పదమే ఒక అద్భుతం
ఆ అద్భుతమైన మైత్రి తెస్తుంది
జీవితంలో వసంతం

స్నేహం
పచ్చని పైరులా నవ్వుతుంది
చల్లని చిరుగాలిలా కబుర్లాడుతుంది
నీడల్లే వెన్నంటి ఉంటుంది
ఆకలేస్తే అన్నం పెడుతుంది
ఆవేదనలో ఓదార్పవుతుంది
బ్రతుకుపై భరోసానిస్తుంది
హృదయానికి ఆయువై శ్వాశనిస్తుంది.

అదే స్నేహం
రేవుకు పడవవుతుంది
నావకు తెరచాపవుతుంది
పుడమికి వానవుతుంది
జోరువానకు గొడుగు పడుతుంది
ముళ్లబాటపై తాను నిల్చొని
పూలపాన్పు అవుతుంది

ఆ స్నేహమే
కలిమిలేముల్లో
సమభావనతో
ఒకే బాటన నడిపిస్తుంది
జీవితానికి దిక్సూచి అవుతుంది

అదే స్నేహమే
తుచ్ఛమైన ఆస్తులు అంతస్థులకై
కొట్టుకుచచ్చే రక్తసంబంధీకులకతీతమైంది
దేనితోనూ వెల కట్టలేనిది
ఏ బంధంలోనూ దొరకని పెన్నిధి
స్నేహబంధంలోనే లభిస్తుంది

అదే స్నేహానికున్న పరమార్థం
అదే కదా స్నేహంలోనున్న మాధుర్యం



-నాగముని. యం
9490856185

## మేం మూగజీవాలమైనా బాగుండేది

ఆడది అని తెలిసి
పురిటిలో చిదిమేసేవారు కొందరు
నడివీధిలో వేధించేవారు ఇంకొందరు
కామవాంఛలతో బలితీసేవారు మరికొందరు
ఈ రక్తమాంస దేహాన్ని గుచ్చిగుచ్చి చూసేవారు ఎందరో...
భగవంతుడా...!
బలయ్యే మానవ బ్రతుకులో పడవేశావు మమ్ము
దీనికన్నా నీవు మమ్మల్ని
మూగజీవాలుగానైనా
సృష్టించినా బాగుండేది
నడివీధిలో స్వేచ్ఛగా తెరిగేవాళ్ళం.



- కవిశ్రీ
9493785596

## మెరుపులు

అందరితో కలిసుండేది
మంచి స్నేహం
ఎచ్చుతగ్గులు చూపుతుండేది
పెరిగిపోయిన అహం !!

మోసపు మాటాలాడువాడు
స్నేహితుడు కాదు
నమ్మకానికి కీడుచేయువాడు
అసలు సన్నిహితుడేకాదు !!

పంచుకొని తినేది
పరమాన్నమైన స్నేహం
కష్టాలలో తోడుండేది
పెన్నిధైన స్నేహం !!

రాజుల స్నేహాలు
రాళ్లపాలు ఎపుడు
స్వార్థంలేని స్నేహాలు
జగతిలో మెలెపుడు !!

పొట్టి పొడుగులు
స్నేహాలకు అడ్డుకాదు
నలుపు తెలుపులు
స్నేహానికి అడ్డముండరాదు !!

మంచి మనసుంటే
ఆడవారితోనైనా స్నేహంచేయ్యొచ్చు
కల్మషం లేకుంటే
మిత్రులుగ జీవించవచ్చు !!

ఏనాటికి ఐనా
స్నేహమన్నది చెరగదు
తెలుసుకో చైనా
పరిస్థితులబట్టి మారదు !!



-తాండ్ర చిరంజీవి
9959180762.

## ఆవహించిన చీకటి

చీకటి నన్ను ఆవహించింది
ఎన్ని ఆశల వెలుతురు
కిరణాలు ఉదయించాలని
పట్టుదలతో కోరుకున్నా
భయం నా నుండి వెళ్ళలేదు.

ఒక్కొక్క రూపమై
ఒక్కొక్క చర్య ఫలమై
నాముందు ప్రశ్నిస్తూ వెక్కిరిస్తూ
నిలబడుతున్నది ప్రతి అంకంలో

ఈ చీకటి ని చూస్తే నాకు భయం
ఇప్పుడు చీకటి నన్ను చుట్టేసి
నా ఉనికిని ప్రశ్నిస్తున్నది
ఆనందపు ప్రతి అడుగున నిలబడి
దుఃఖ కౌగిలి లో నన్ను బంధిస్తున్నది.

ఎంత ప్రయత్నించినా ఎంత
ధైర్యమై నిలుచున్నా
రూపాలను మార్చుతున్నది
ఆలోచనలకు అడ్డుగా తీపిని చేదుగా
మార్చి మార్చి ఎదురుగా వస్తున్నది.

ఈ చీకటి భరించ రానిదై ఉంది
నా నడక ఒకొక్క అడుగు
కనిపించని గమ్యమయ్యింది
ఇంతగా నన్ను చుట్టేసింది చీకటి

ఈ దారిలో కిరణాలు రావడమే లేదు
సూర్యుడు కనిపించక దాక్కున్నాడు
సహనమైన నేను ధైర్యాన్ని వీడలేదు
అదెప్పుడు నను వీడక ఉంది
నా నడక ఆగక సాగుతున్నది
జీవితం చీకటయ్యాక
ఆశల రెక్కలు ఎలా తొడుగుతాయి

కార్చిన కన్నీటి ప్రవాహం లో
ఆశలన్నీ కొట్టుకు పోతున్నాయి
ఇక ఆశలేమీ మిగల లేదు
రాత్రి చీకటి వీడడం లేదు
వెలుగు కోసం ఇప్పుడు
ఓ కాగడా ను వెతుకుతున్నాను
ఇప్పుడు బతుకు చీకటి ని చీల్చే
మంటగా మండుతున్నాను
ఇప్పుడు
ఆశయాన్ని బతికించడానికి
నా బతుకు లో వెలుగు కోసం
దివిటీ నవుతున్నాను
ఈ చీకటి ని చీల్చడానికి.



-సిరిసిల్లా గఫుర్ శిక్షక్
9849062038

## అంచు లేదు ఆ నింగికి

అంచు లేదు ఆ నింగికి
హద్దు లేదు ఈ నేలకు
ఆశలకు హద్దు లేదు
కోర్కెల పొద్దు గూకదు

అడవి అవనికి ఆక్సీజన్
నగరం పుడమికి పొడుగాలి
ప్రకృతి పచ్చని హారమెండే
వికృతంతో భూగోళం మండే

పంటల దిగుమతి కోసం
ఎరులెన్నో చేళో ఎగ చిమ్మి
పురుగు మందుల పంట ఇంట
వంటలోన కలిసి ఒంట కలిసే

మందు లేని తిండి మచ్చుకు లేదు
కల్తీ లేని వస్తువు కానరాదు కంటికి
దొంగల నుండి బద్రత లేదు ఇంటికి
కూడు దొరకక కునుకు లేదు కంటికి

రాద్దామన్న పెన్ను కదలడం లేదు
పాడుదామంటే గొంతు పెకలడం లేదు
ఆడుదామన్న అడుగు పడటం లేదు
ఆనందం జీవితాన ఆవిరయ్యిపోయో



-ఉప్పెన
8106073661

## భరోసావాక్యం

ఉదయాన్ని,
స్వీయరక్షణఉద్యానవనం చేసుకుందాం
ఆరోగ్యపరిమళాలతో
మిగితాదినాన్ని తేలికగా ఏలుకుందాం...!
సూర్యునికన్నా ముందే నిద్రలేచి
నడకకు రమ్మని అతన్నే పిలుద్దాం..
నమస్కారాలతో కొలుద్దాం..!
నీరెండను స్నానం గా పూసుకొని
విటమిన్ డి ని ఇంకాయింకా
మనలోకి యింకించుకుందాం,
ప్రాణాయామం లోనే ప్రాణమున్నది కదా
ప్రాణం నిల్పుకోడానికి
దాన్ని ప్రాణంగా స్వీకరించలేమా?
ఆసనాలచింతబరిగెవట్టుకొంటే
ఎంత బద్ధకమైనశరీరమైనా
బుద్ధిగా చెప్పినట్టు వినదా?

రకరకాల ఆసనాలుగా మనం ఒదిగిపోతుంటే
తేలికవుతున్న మనదేహం అనేక అనారోగ్యసందేహాలకు
సమాధానాల సందేశం అందించడం మనమే చూస్తాం!
భూగోళం మీద నీటిశాతం ఎక్కువ
నేలశాతం తక్కువనట..
మరి మనకడుపు ఒక భూగోళమే ..
వేన్నీళ్ళో చన్నీళ్ళో పొద్దున్నే పొట్టకు గట్టిగా పట్టిద్దాం..!
అన్నీ అయ్యాక
అల్లంఛాయి తో పాటు మంచిమంచి
కవితలు సేవిస్తూ..
ప్రతిఉదయానికొక నిండుదనమిద్దాం ..
నిండుఆరోగ్యజీవితానికి ఏరోజుకారోజు
ఒక భరోసావాక్యాన్ని కానుకగా రాసిద్దాం!



-డా.కాసర్లనరేశ్ రావు
9441406252

## హైకూలు

విరిసే సుమాలన్నీ
పరిమ లించవు
అంతా మంచి వాళ్ళు కాదు

పొరపాట్లు
జరిగాయి
ఎదగడానికే

చీకటంటే
చెవి కోసుకొంటా దు
దొంగ

రాత్రి వర్షం వచ్చింది
గులాబి
నవ్వింది

కొంగ జపం
చేప దొరికే వరకే
నాయకుడే

గాలి ఎక్కువైంది
చెట్టు
గానం చేస్తుంది

అర్ధాంగి కారంతోనే
పెళ్ళిళ్ళు
ఆడ పిల్లలు

రెక్కలు లేకున్న
ఎగురు తాయి
ప్రేమ పక్షులు

తారల
తళుకు బెళుకులు
ఆకాశానికి అందాలు

నమ్మకం
గుండె
గుడిగా మారింది

వాకిట్లో
బోగి మంటలు
ఇల్లు శుభ్ర పడింది

కరువు
కోరలు చాచింది
గోచితో రైతు

గ్రామం నిండా
కుటీర పరిశ్రమలే
సారా సరఫరా

ఉదయాన్నే
పువ్వు నవ్వింది
తిరిగి రానని

బాత్ రూమ్‌లో
బొద్దింక
బట్టల లేవు

ఆకాశం
అందంగా ఉంది
చుక్కల పూలతో

సూరీడు
కన్నెర్ర చేశాడు
ప్రకృతి విధ్వంసం

కొండ గుండె లో
ఎంత దిగులో
బోరున వర్షం

సూరీడు
కళ్ళు తెరిచాడు
లోకం మేలుకొంది

కట్నం ఎక్కువే
అత్తా కోడళ్ళు
చెట్టాపట్టాలు

వేసవిలో
పవర్ కట్ లేదు
ఎన్నికలు

నేతల మాటలకే
కడుపు నిండిది
గ్యాస్

ఉసిరి
ఊరించిది
పళ్ళు పులిపెక్కా యి

కాంక్రీట్ జంగిల్
చెట్లన్నీ
బోన్సాయ్‌లు

అధిక జనాభా
మొక్కలైన, కుక్కలైన
ఇంట్లోనే

ఆది మానవుడి
ఆలారం
కోడి

మొక్కు కోసం
గుండు
(క్ష)వరమే

గరిక
గద్దె నెక్కింది
వినాయక చవితి

నవ రాత్రులు
సందు సందుల్లో
సంబరాలు

తేలు కుట్టింది
నొప్పి ఎక్కువయ్యింది
కళ్ళు తెలేశాడు

ఎండబివాన
రెండూ అవసరమే
జీ 'వనానికి'



-ఆచార్య గిడ్డి వెంకట రమణ
9440985416

## స్నేహమంటే.. !

శిశిరంలో వసంతం
నిశిహృదిలో పండువెన్నెల
కష్టాలకడలిలో అభయహస్తం
నీడలేని లేమికి ప్రేమకలిమి..!

ఎద కన్నీటిని తుడిచే చిరునవ్వు
మది వేదనను మాన్పెదివ్యౌషధి
ఆవేదనను అక్కున చేర్చుకునేది
ఆపదవేళ నేన్నునంటననేది..!

కలిమి లేముల కతీతం
లేమికి యెనలేనుబలిమి
మనసున్న వారికి మాలిమి
అపురూప వాత్సల్యం..!

తనువులు మాత్రమువేరు
మనములు మాత్రముఒక్కటే
పాలునీరు కలయిక తీరు..
కలకాలం తేటమనసు తేనెజాలు.!

కాలం కరిగిపోయిన నిలిచేది
చీకటిలో చిరుదీపకాంతి
గాయాలమదికి జ్ఞానలేపనం
నిత్యనూతనమైన వెలుగు
అపాయంలో ఆదుకునే గుండె
అనురాగాలీను జిలుగు..
అజరామరమై వెన్నంటినిలుచు..



-డాక్టర్ గన్నోజుశ్రీనివాసాచారి
8555899493

## పోతన మొగ్గలు

తేనెలొలికించే మధురమైన పద్యాలను
సహజంగా రాసి సహజపండితుడయ్యాడు
ఎన్నటికీ తరిగిపోని సాహిత్యసంపద పోతన

రచనల్లో భక్తిని చాటిన మేటి కవిగా
చిరయశస్సును పొందిన భక్తాగ్రేసరుడు
మోక్షసాధనకు భక్తిమార్గం చూపిన పోతన

తెలుగు సాహిత్యవనంలో నాట్యం చేసే
రసాలంకారయుక్త పద్యాలకు ఆద్యుడు
కవితారమణీయతకు రూపం పోతన కలం

తన కష్టంతో జీవనం సాగిస్తూనే
తన కలంతో భాగవత కవనం చేసాడు
కీర్తిప్రతిష్టలను తృణంగా వదిలేసిన భక్తఘనుడు

సరళసుందర పదాల అల్లికలో నేర్పు
తెనుగుదనం అద్దడంలో పోతనకు పోతనే సాటి
మృదుమధుర భావాలకు బంధుజనుడు పోతన

- సి.శేఖర్
9010480557

## సల్లంగా బతుకు బిడ్డా

ఏం జేయాలరా కొడుకా
సావు గుడా నన్ను సూసి రోసిగ్గోనింది
కుక్కి మంచంలో కూరుకపోయిన కాయాన్ని మోయలేక
తడికే తూట్లులోంచి తొంగిసూతున్న
మిత్తిని కనికరించి కొనిపొమ్మని
ఏడుకున్నా కండ పోకుండా ఉంది బిడ్డా.

నువ్వెందుకంత యాస్టి పడతావు లేరా
ఈపొద్దు కాకపోతే రేపైనా పోతాను
ఆపొద్దు నేను నిన్ను కాదను కొని ఉంటే
ఇప్పుడిట్టా వుండేవాడివా ?
నువ్వు కడుపులో ఉన్నపుడు కాళ్లతో తంతే నీ కాలెక్కడ
కందిపోయుందోనని కలవరపడిపోతిరా కన్నా.

భవబంధాలు దాటుకుని బయట పడినప్పట్నుంచి
కాళ్ళకింత కాసింత మట్టికూడతగలకుండా
కండ్లలో పెట్టుకొని కాపాడుకున్నారా కొడుకా.

పడిశం దగ్గుతో నువు భాధ పడుతుంటే
ఆకలి ఎరుగని ఆవులా కాళ్ళలో కంపలు
గుచ్చుకున్నా కానంతా తిరిగి కానుక్కాయలు తెచ్చి
కుత్తికకు కట్టి నిన్ను ఒడిలో పెట్టుకొని నిధురలేని రాత్రులకు
కాపు కాసినానురా కన్నా
అమ్మోరు పోసి నువ్వాయాసపడిపోతుంటే
పెయ్యికి యాపాకు సుట్టు కొని
పోలేరమ్మ కట్టసుట్టు పొర్లు దండాలు సేసి పోతున్న
నీ పానాల్ని యనక్కి తెచ్చు కున్నానురా కొడుకా.

ఆకలి ఏడుపై ఇనిపిత్తే తట్టుకోలేక
ఎండిన రొమ్ముల్లోని రగతాన్ని పాలగా సేసి
నీ కడుపు నింపినాను బిడ్డా

యాందీ ఈయమ్మ ఈసోదంతా
యందుకు సెబతాదాని ఇసుక్కుంటున్నావా ?
ఏంటికో గతమంతా నెప్పికొచ్చి
గుండెల్ని పగిలేసుకున్నాలెరా

నిన్నిరుకున పెట్టాలని నాకేం లేదురా
పొమ్మన్నా పోకుండుదిరా మొండి పానం
ఇపుడు కాకపోతే కొంచేపటికైనా పోతాలే గాని
నువ్వు మటుకు నాలా యాతన పడకుండా ఉండు నాయనా.

బిడ్డా సెప్పటం మరచి పోయినానురా
నేను పోయేలోపల నాకాల్ల కడియాలను
కొట్లో అమ్మి కావాల్సిదంతా కొనుక్కొని
కాలు మింద కాలేసుకొని కన్నోలను సూసుకో బిడ్డా
ఇగ నా సావుకర్చులకంటావా
నేను దొంతి కుండలో దాసుకున్న
సావర దుడ్లతో నా శవాన్ని సాగనంపు సిన్నా.

కన్నా ఐపోయిందిలేరా
ఎంత ఎగపీలిసినా ఊపిరాడటంలేదు.
బిడ్డా పోతున్నానురా
నువ్వు మటుకు సల్లంగా బతుకు బిడ్డా.



-ఆవుల వెంకటేసులు
9441665095
9505956886

## ఆశే శ్వాసగా..

పట్టుదలను తలపాగగాచుట్టి
శ్రమ చక్రాలపై పరిగెత్తుతూకూడ
అక్షరాన్ని మూడో నేత్రం గా అద్దుకొని
ఉడుకు రక్తం చల్లబడే దాకా
జోడు గుర్రాలపై స్వారీ చేస్తా....

ఆరోగ్య సిరులు కురిపించే
ఓంకార పదాల డమరుకాలను
నాలుకలపై నాట్యమాడిస్తూ
మూలనపడ్డ ఆయుర్వేద
ఔషధ నిధులను తవ్వుకుంటూ
మళ్లీ మళ్లీ తాగిస్తా....

అక్షరాన్ని ఆయుధంగా మలుచుకున్న
నన్ను నేను చెక్కుకునేఉలిగామారి
రత్నాలై మెరుస్తున్ననవ యువతరం
పాశ్చాత్య మోజు గుళిక లకు లొంగకుండా
సంస్కరణలు చెక్కే శిల్పి గా ఎదిగి
స్వదేశీ తీపి సంస్కృతి పచ్చ పైరును
యెదమడిలో నాటేస్తా......

మాతృదేవోభవ పితృదేవోభవ
వేద ఘోషపంచాక్షరీ మంత్రంగా
గుండె గుడిలో మోగిస్తూ...
వృద్ధాశ్రమాల ను తరిమేస్తా...

మరో బాల్యం వారికి దక్కాలని
భరత జాతి చరిత్ర దేదీప్యమానమై
సృష్టి ఉన్నంత కాలం జాతి రత్నాలై
చల్లగా బతకాలనే ఆశే శ్వాసగా తపిస్తున్న.!!



-అరుణ కీర్తి పతాక
9395147443

## నేటి బతుకు చిత్రం

చిత్ర కారుడికి సైతం
అంతు చిక్కని బతుకు చిత్రం
భిన్న వర్ణాలతో సమ్మిళితమై
ఏ కుంచెకు దొరకని వి చిత్రమాయె

వారసత్వంగా వచ్చే పేదరికం
తరాలు మారినా తలరాత మారలే
ఎన్నికలు ఎన్ని వచ్చినా నేతలు
మారుటే తప్ప వ్యతలు మాత్రం
ఎక్కడ వేసిన గొంగడి అక్కడే

అవకాశం అందుకొని
శిఖరాలు ఎక్కినోడు
తనవారిని ముంచి
తలదన్ని పోతుండు

విడచి పోలేక పేదరికం
దరిద్రంతో జతకట్టి కూలి వాన్ని
చేసి వలస పొమ్మంటుంది
ఆకలి మంటలు రేగి అన్ని మరిపించి
అడుక్కునేవాన్ని చేసింది

బరితెగించినోడి బలుపుకు
బలిఅవుతున్నది పేదవాడు
పనులన్ని ఆగిపోయి పస్తులుంచి
కాని ఊరిలో కంటతడి పెట్టిస్తుంది

అద్దె బతుకుల వలస జీవులు
మాడే కడుపుతో వీడే నగరము
ఎవరికి పట్టని వలస బతుకులు
దారి వెంట రోదిస్తున్నయి

బొబ్బలొచ్చి అడుగులు తడపడుతుంటె
కారే రుధిరం ముద్రలు వేస్తు నడుస్తుంటె
మౌనం మార్గము చూపిస్తుంది

ఎంతకి రాని ఊరు ఇంకా నడవమంటె
సొమ్మసిల్లిన వలసల బతుకులు
దుర్బర బాధను భరిస్తున్న తనువు
తనవారిని చేరే ఆశతో ముందుకు నడిపిస్తుంది.



-బి.సుధాకర్
9849243908

## అన్నీ తానే....

నాకు తెలివి రాగానే
నేను చూసిన మొదటిదది
ఆ తొలిచూపులోనే నన్ను కట్టిపడేసింది
ఆ వెన్నెల చల్లదనాన్ని అరువు తెచ్చుకున్నట్లు
ఆ పువ్వులకే తన సుకుమారాన్ని
అప్పుగా ఇచ్చినట్టుగా
అంత అందంగా ఉందది

తెల్లని మబ్బులను ఆక్రమించిన
నల్లని మేఘాలుగా పరుచుకుంది
మొగలి పూల పరిమళాల అన్నట్లు
సువాసనలు వెదజల్లుతుంది
ఇంద్రధనస్సు నుంచి రంగులను
తెచ్చుకుందేమో అందుకే అంత అందం
ఆ అందం ఆ రూపం ఆ తేజస్సు
నన్ను గుక్కతిప్పుకోనివ్వట్లేదు
పడుకున్నా మెలకువగా వున్నా
తన ఆలోచనే
ఆలోచన కాదు
తానే నేనైనానేమో అనేట్టుగా మారింది
ఎంత చూసినా తనివి తీరట్లే
తనని తడుముతుంటే
అప్పుడే విచ్చిన పువ్వులను తాకినట్టుగా
తన బుగ్గలపై నిమురుతుంటే
తన వైపే లాగుతున్నట్లుగా
నన్ను విడువకు అన్నట్టుగా ఉంది

తనతో ఎంత గడిపినా
తనివి తీరట్లే...
రాత్రంతా తనతో వున్నా
అప్పుడే తెల్లారిందా అన్నట్లు
పగలంతా తనతో గడిపినా
అప్పుడే చీకటి పడిందా అన్నట్లు
కాలమే తెలియకుండా
తన చుట్టే తిరుగుతున్నా.
అంతా నన్ను చూసి నవ్వుకున్నా
నవ్వుకుందురుపో...
నాకేమి సిగ్గు? అన్నట్లు
తెగించి జతకట్టా
మిత్రులంతా
ఒరేయ్...వాడు పిచ్చోడురా అంటే
ఓహో... ఇంత అమితంగా ఇష్టపడ టాన్ని
పిచ్చి అంటారా? అని నవ్వుకున్నా
ఇంతకాలం తనతో సహజీవనం చేసినా
ఎంతసేపు తనని అనుభవించినా
ఇంకా కొత్తగానే ఉంటుంది
ఇంకా ఇంకా కలిసి జీవించాలని ఉంటుంది
కానీ...
ఇది దాహమా...?
అయితే... ఎప్పటికీ ఆగునో ఈ దప్పిక
ఇది మోహమా...?
అయితే... ఎప్పటికి తీరునో నా మోహము
ఇంతగా నన్ను ఆకర్షించి కట్టిపడేసింది
ఎవరనే కదా మీ ప్రశ్న

అది... అదీ...
'పుస్తకము'
పుస్తకము నా మస్తిష్కము
"నేను పుస్తకాన్ని వీడడం అంటే
నా ప్రాణాన్ని వదలడం"అని
అర్థం చెప్పాలేమో....

-దిలీప్.వి
సెల్:8464030808

**నేటినిజం** చందా వివరాలు
ప్రతి వారం ప్రచురిస్తున్న 'సాహితీ కెరటాలు' గల 'నేటినిజం' 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను 'నేటినిజం' తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు. లేదా SBI 3056 7652 629, IFSC: SBIN 0011660
Gandhi Nagar Branch Hyderabad-80 అకౌంట్‌లో వేయవచ్చును.

## వాన విల్లు

ఇన్నాళ్లూ...
నిశబ్ధాల నడుమ
నిస్తేజాన్ని నిలిపి
ఇప్పుడు
ఆకాశం కొన్ని ఆకృతులు అద్దుకొని
అద్భుత హంగుల్ని ఆరబోస్తోంది

వర్షం రాకతో
వంకలూ,వాగులు పొంగుతూ
నదులు నవ్వుతూ
నాలుగు అడుగులు కదిలాకా
భూమంతా ఆకుపచ్చ రంగు అరంగేట్రంతో
కొత్త రూపు పురుడోసుకొంది

నీలి మేఘాలు నల్ల రంగు అద్దుకొని
వస్తున్నానంటూ ఆజ్ఞలు జారీ చేస్తున్నాయి
పైరు పాటల పల్లకిలో
పుడమి పులకిస్తూ పునీతం అవుతోంది

చల్లగాలి చిరు సవ్వడులతో
కొండా కోనా, ఊరూ వాడా,
ఊపిరిని పీల్చుకొన్నాయి

ఆకాశానికి హారతులు పడుతూ
పక్షుల గుంపు గుప్త గానాల్ని ఆలపిస్తున్నాయి

వచ్చిన వాన వసంతానికి వేడుకగా
ఆకాశ వీధిలో
వాన విల్లు కనువిందు చేస్తూ
కమ్మని కలన్ని ఆరబోస్తోంది...



-మహబూబ్ బాషా చిల్లెం
9502000415

## సృష్టి

పచ్చడి మెతుకులు తిన్న
పంచ పరమాన్నాలు తిన్న
ఆకలితీరడానికే
పువ్వులు వేరైనా
వాటిలో ఉండే
మకరందం ఒక్కటే

కామధేనువులు ఎన్ని
రంగులో ఉన్న పాలు
మాత్రం తెలుపే
మనుషులు వేరైనా
రక్తం మాత్రం ఒకటే
స్త్రీలు వేరైనా
అమ్మతనం ఒకటే

కళ్ళు వేరైనా నా
చూపు ఒక్కటే
గుడిసెలో ఉన్న
అంతస్తులో ఉన్న
నివాసం ఒకటే

కలలు వేరైనా
నిద్ర ఒక్కటే
తరువులు వేరైనా
అందించేది ఫలాలే
మరణాలు వేరైనా
అంతరాత్మ ఒకటే
ఎన్ని ఆస్తులు ఉన్న అందరూ
భువిలో నీకే



-చాపలమహేందర్
9949864152

## శ్రమదాత

కూలివాళ్ళు జీతగాళ్ళు
పాలేరుగాళ్ళంటూ జాలిలేని మాటలు
మా స్వేదం మా రక్తం ధారవోసి
మీకు వేస్తాము బంగారు బాటలు
కడవరకూ కష్టంతో కడతాము మీ కోటలు
మాకు కూర్చునేందుకు గుడిసెలోన లేవు పీటలు
గోదాన భూదాన మన్నదానమంటారు
శ్రమదోపిడీచేసి దోచుకున్నదంత దాచుకుంటారు
అన్నిదానములలో శ్రమ దానమే ప్రధానమని ఎరుగరు
ఎరిగినా ఎరగనట్లు మిన్నకుంటారు
దాతలందరిలో శ్రమదాత ఉత్తముడని ఒప్పరు
ఒప్పితే తమ ఉనికికే ముప్పనుకుంటారు
శ్రమదాతలే అవిశ్రమాశ్రమదానమే చేయకున్న
ఈ సుందర ప్రపంచాన ఏడువింతలు చూడగలిగేవారమా
శ్రామికశక్తి స్వేదజలవృష్టి ధారలే కురిపించకున్న
ఈ మనోహర ప్రపంచాన్ని వూహించగలమా
దాక్టరైన, యాక్టరైన, ప్లీడరైన, లీడరైన హెూదాలెన్నివున్నా
మా కళ్ళుకదిలితే కడుపునిండు లేకుంటే కడుపుఎండు
ఇంతచేసినా మేమెపుడు వెనకబడివుండు
విధాతకైనా మాపై కరుకుదనమే మెండు
మా కష్టాన్నే చమురుగా మా ప్రాణాన్నే ప్రమిదగా
మా దేహమే ఒత్తిగా భువనాన వెలుగు నింపుతాం
నిశ్శబ్దనిశీథిలో అంతర్ధాన మౌతాం
మరి మా జీవితాన వెలుగులెప్పుడు
మా బతుకున వసంతం విరిసేదెప్పుడు
మనిషిలో ఈర్ష్యాద్వేషం
స్వార్థపరత్వం పోయినప్పుడు
వెట్టిచాకికీ బానిసత్వకట్ల తెంచుకుని
శ్రామికజలం ప్రవహించినప్పుడు
శ్రమజీవులు కాదు శ్రమదాతలంటూ
చరణారవిందముల విశ్వజనావళి మోకరిల్లినప్పుడు
అప్పుడే ఎగురుతుంది శ్రమదాత
కీర్తిపతాక స్వేచ్ఛగా గగనాన
రెపరెపలాడుతూ జగద్గిరిశిఖరాన.

– పావులూరి మల్లికార్జునరావు
సెల్: 9705120804

## జీవన సార్థకం.

పగలూ రాత్రీ వచ్చి పోతూనే వున్నాయి
శిశిరం వసంతం మళ్ళీ మళ్ళీ వస్తున్నాయి.
కాలం ఆడే ఆటలో ఆయువు
తరిగిపోతూనే వుంది
అంతులేని ఆశలతో పరు గులూ
డబ్బు మీద యావ తగ్గడమే లేదు
శాంతితో సమానమైన తపస్సు,
సంతోషాన్ని మించిన సుఖం,
దయను మించిన ధర్మం మరొకటి
లేదని తెల్సినా ఎందుకో ఏమిటో
ఆరాటం ఆగడంలేదు
కేవలం సంపాదించడం, తినడం,
అంతులేని దురాశలతో నిత్యం
కష్టాలను అనుభవిస్తూ జీవించడమే
జీవితంగా భావించే వారినేమనాలి?
ఆ యావ తగ్గించుకుని భగవంతుని మీద
ద్రుష్టి సారించి, ఈ పుణ్యభూమి మీద
జన్మించినందుకు జీవితాన్ని
సార్థకం గావించుకోవాలి.



– డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

## దాశరథి మొగ్గలు

చిన్న గూడూరులో వజ్ర తేజస్సుడై జన్మించి
అక్షర గళంతో తిరుగుబాటును లెవదీసిండు
కవనంతో గొంతెత్తి గర్జించిన సింహం దాశరథి.

శ్రామికజాతి పక్షాన ఉజ్జ్వల ఉషోదయమై నిలిచి
నిద్రాణమైన ప్రజలను రుద్రవీణమీటిన చైతన్యుడు
తెలుగుప్రజలకై ఆరాటపడిన ఆరాధ్యదైవం దాశరథి.

నా పేరు ప్రజాకోటి నా ఊరు ప్రజావాటి అంటూ
పద్యాన్ని పదునైన ఖడ్గంగా మలిచిన వీరుడు
అగ్నిధార'గా ఉవ్వెత్తున ఎగిసిపడిన దాశరథి.

భూస్వాముల దౌర్జన్యాలను అక్షరంతో ఎదురించి
ధనవంతుల దుర్మార్గాలను నిలదీసిన శూరుడు
నిరంకుశ పాలననడ్డుకున్న ధీరశాలి దాశరథి.

నిజాంనవాబు గుండెను చీల్చిన మాటల తూటాయై
తెలంగాణ విముక్తికై పోరుచేసిన ప్రళయరుద్రుడు
గడ్డిపోచకు కూడా వీరత్వాన్ని నింపిన దాశరథి.

సినిలోకాన సాహిత్య పరిమళాలు వెదజల్లి
సముద్రగర్భంలో బడబాగ్ని జ్వాలలను రగిలించాడు
సాహితీవనంలో ఆణిముత్యమైన కవి దాశరథి

గాయాలుగా సలుపుతున్న పోరాల బిడ్డల గాథలను అక్షరబద్ధం
చేసిన విప్లవకవియోధుడు
కావ్యాలతో ఉద్యమప్రేరణ కలిగించిన దాశరథి

నా తెలంగాణ కోటి రతనాల వీణయని కలంతో
గళమెత్తి ఊరూరా సమరశంఖారావం పూరించాడు
తెలుగు ప్రజల గుండెల్లో ఆశాజ్యోతి దాశరథి

నిజాము నవాబు నెదిరించి జైలుగోడల నుండి
జనాన్ని చైతన్యపరచి ఉద్యమాన్ని ప్రేరేపించాడు
తల్లి తెలంగాణను తనివితీరా స్తుతించిన కవిసింహ.



-కొలిపాక శ్రీనివాస్
9866514972

పుస్తక సమీక్ష

# వాస్తవమైన "కర్షక సన్నుతి"






రైతే రాజు, రైతు దేశానికి వెన్నెముక, రైతు అన్నదాత, అంటూ అనేక రకాలుగా అనుకుంటూనే ఉంటాం. కానీ ఒక్కటీ ఆచరణలోకి రాదు. రైతుకు అంతటి స్థానాన్ని ఇచ్చినా అవి కేవలం మాటలకే పరిమితం అవుతోంది తప్ప రైతు ఆవేదనను గుర్తించేవారు లేరు. ఆరుగాలం కష్టపడి పంటను పండిస్తే నోటికొచ్చిన ఖరీదును చెప్పి కనీసం వారి పంటకే కాదు వారి కష్టాన్ని కూడా లెక్కచేయని వారి మధ్య మన జీవితం. అందుకేనేమో కవి కంతి మల్లేశ్ రైతును స్తుతిస్తూ, రైతు యొక్క సామర్థ్యాన్ని వివరిస్తూ ఈ గేయ కవితలను అందించారు. **"ఎండకు ఎండిన వానకు తడిసిన / ఎండడు మండడు ఏనాడు/ ఎండా వానా సమమని తలిచే / గండరగండడు కర్షకుడు"** అంటూ ప్రారంభించిన కర్షక సన్నుతి వాస్తవంగా ఉంది. నిజమే. కర్షకుడు ఎంతో గుండె ధైర్యం ఉన్నవాడు కనుకనే ప్రకృతి పరంగా, వ్యక్తుల పరంగా, ప్రభుత్వం పరంగా నష్టం కలుగుతున్నా ఇంకా ఇంకా నేలను నమ్ముకుంటూనే ఉన్నాడు. మనకు అనేక పంటల్ని, ధాన్యాల్ని అందిస్తూనే ఉన్నాడు. కానీ భరిస్తున్నాడు కదాని మరింత బాధపెడితే మాత్రం ఎవరు మాత్రం ఎంతని భరించగలరు? అనేదే ఈ కవి ఆవేదన. కర్షకుని వేదన ఎవరూ పట్టించటుకునే వారే లేరా అనేదే ఈ కవి బాధ. అందుకే **"రెక్కలు ముక్కలు జేయుచు/ పట్టెడు అన్నము కోసమని/ రేయింబవళ్ళ తేడా నెరుగక/ దున్నడమేరా రైతు పని"** అంటారు. ఈ గేయ కృతిలోని శైలి ఎంతో సున్నితంగా ఉంది. వస్తువు కర్షక జీవితమే అయినా సర్వజన ఆమోదమైనది. కర్షకుడు కేవలం వ్యవసాయ కూలీ మాత్రమే కాదు, మహెూన్నతమైన మనస్తత్వం కలిగినవాడని మల్లేశ్ తెలియజేసారు. అందుకేనేమో **"రాజుల కైనను, రాజొకడున్నడు/ రైతే రాజును వాడొకడు/ యాజుల మించిన యాజియు వాడే/ సేద్యపు యజ్ఞము చేసేడు"** అంటూ రాజులకు మించిన రారాజు అనే అభిప్రాయాన్ని ఇలా తెలియజేసారు.

**"భూజనులందరి ఆకలి బాధలు/ భుజముల పైనే మోసేడు/ పంటను కాచి కంటికి నిద్దుర/ పంటను కాచి కంటికి నిద్దుర/ రాకుండానే చేసేడు"** మరోచోట **"భూమిని దున్నుచు విత్తులు నాటక/ యామినిలోనూ ఒంటరిగ/ పంటకు కాపుగ ఉండుట కోసము/ జంటను వీడును తుంటరిగ"** అంటూ కర్షకుని దుస్థితిని వర్ణించారు. ఇందులో అతని కర్తవ్య దీక్షను తెలియజేయడమే అతని ఉద్దేశ్యం. అంతే కాదు ఒక్కో చోట మరీ చురుకుగా కూడా పదాలు వెదజల్లబడ్డాయి **"దేశానికి రైతు వెన్నెముక యని/ దేనికొరకు చెప్పుట కింక/ అతనిది వెన్నెముకను విరిచినమని / సిగ్గుపడాలోయ్ నీవింక"** అంటూ శుష్క వాగ్దానాలతో ఆశచూపి గద్దెల నదిరోహించిన వారికి చురకలంటించడం మనం ఈ గ్రంథంలో గమనించవచ్చును. సమాజంలోనూ, ప్రభుత్వంలోనూ ఎన్ని మార్పులు సంభవించినా రైతు జీవితాన్ని మార్చేవారే లేరా? అనే ప్రశ్నించడమే ఈ గ్రంథంలోని సారాంశం. కష్టాలను కన్నుల్లో దాచుకున్న ఈ యోగిని బాగుచేసేవారే లేరా అనేదే ఈ కవి వేదన.. ఆ వస్తువు ఎంత పాతదైనా, సమస్య ఎప్పటికప్పుడు కొత్తదే.. కవి మల్లేశ్ కు నా అభినందనలు

ప్రతులకు :కంతి మల్లేశం
ఫోన్: 9160396596



–శైలజామిత్ర
9290900879

## మనసు గాయం

కలం పరుగు పెడుతుంది
కాలం ముసుగు కప్పుకుంది
అక్షరాలన్నీ ఏడుస్తున్న
కన్నీళ్లను కారుస్తున్న
భావాలు బాధలు పంచుకున్న
ఆశా లతలతో సమాజాన్ని చుట్టుకున్న
పలకరించే వాళ్ళు ఎవరు...!!

రక్తము ఇంకుతుంది
మనసు కాగితంలా నలిగింది
ముడుతలు ఎప్పుడు పోతాయి
మేఘం కమ్మిన సూర్యుడు
వెలుగులు ఎప్పుడు పంచుతాడు
సొగసు కుంగుతుంది
శరీరం వణుకుతుంది
అక్షరం మాత్రం నిత్యం ప్రజ్వరిల్లుతుంది
ఆదరణ లేక వాడుతున్నాను..!!

కలం ఘాటైన వ్యాఖ్యలు
నిప్పుల వర్షంలా కురిపిస్తుంది
సలసల కాగుతున్న భావాలు
బాధతో పొంగుతున్న హృదయాలు
అక్షరాలకు ఆవేశం పెరుగుతుంది
గతి తప్పిన మనసు
చల్లార్చే మనసు కోసం వెతుకుతుంది...!!

నిరాశతో నిండుకున్న
నిత్య యవ్వనం కళ తప్పింది
పోగు చేసుకున్న మల్లెపూలు
దుర్గంధము వెదజల్లుతున్నాయి
పుస్తకాలలో నిండుకున్న అక్షరాలు
ఎక్కి ఎక్కి ఏడుస్తున్నాయి
నీ వింతే నీ బ్రతుకు ఇంతే..!!



-కొప్పుల ప్రసాద్
9885066235

## పుస్తకం ఆత్మ ఘోష

నిన్నటి దాకా హస్త భూషణమైన
మీ పుస్తకాన్ని నేను
గుర్తుపట్టారా నన్ను ?
నేను ఇప్పటి మీ శరీరాంగమై ఉన్న
మీ ఆత్మీయ నేస్తమైన
సెల్ ఫోనంత ఖరీదైన దాన్ని కాదు
నాజూకైన అందాలు, తొడుగులు
ఉన్న దానిని అసలే కాదు
అందుకేగా నేనంటే మీకంత చులకన !
ఒకప్పుడు మహారాజులు,నవాబులు
నన్ను అంకితం పుచ్చుకోవడానికి
ఎంత ఆరాట పడేవారో
ఎంత గౌరవంగా భావించేవారో !
నా ముఖ చిత్రపు పుటలపై
శాశ్వతంగా లిఖించుకోవడానికి
ఎంత తహతహలాడేవారో
ఎన్ని విలువైన నజరానాలు
ఆనందంగా బహుకరించేవారో
ఎన్నెన్ని యుద్ధాలు చేసేవారో
సెల్ ఫోన్ మత్తులో పడి
నన్ను వదిలేసిన మీకేంతెలుసు ?
నన్ను అక్కున చేర్చుకున్నందుకు
ఎందరు కవులు పేదరికంతో
ఆకలికి ఆహుతాయ్యారో ?

నన్ను చదివి ఎంతమంది జ్ఞానార్థులు
జ్యోతులై మానవాళికి వేగు చుక్కలై
మార్గ నిర్దేశనం చేశారో ?
నిన్నటి దాకా చిన్నారుల చేతుల్లో
చందమామ, బాలమిత్ర
కథల పుస్తకాలనై
వారి ఊహాశక్తిని,భావుకతను,
వీరతను పెంచింది నేను కాదా !
పంచతంత్ర కథల పుస్తకాన్నై
మీలో నైతికవిలువలను కూర్చి
రేయింబవలూ మీకు తోడై నిల్చి
మీ జీవితపు ప్రతి మలుపులో
తోడుగా నిలిచింది నేనే కదా !
మీరు చూస్తున్న సాంకేతిక విప్లవ సౌధానికి పునాదినైంది
నేను కదూ !
మీ విలువల వలువలకు దారాన్నైనిల్చి
మిమ్మల్ని ఉన్నతులుగా నిలిపి
ప్రాచీనతకు, ఆధునిక కాలంతో
అనుసంధానిస్తున్న జ్ఞానవారధినై
ఎన్ని ఆకృతులు దాల్చానో

ఎంత ఘన చరిత్ర నాదని ?
ఊరు ఊరిలో, పట్టణాల్లో
ప్రతి విద్యాలయాల్లో నాకోసం
కట్టిన గుడుల్లో మీరంతా చేరి
నిశ్శబ్దంగా జ్ఞానామృతాన్ని
ఆస్వాదిస్తూ, పిల్లలతో చేరి
అక్షరాల సుగంధాలు పొందేవారు !
ఉద్యమాలతో ఊరూరా వెలసి
కళ కళ లాడిన నా ఆలయాలన్నీ నేడు
బోసిపోయి నిర్జీవాలయాలయ్యాయి!
నన్నిపుడు చిత్తుకాగితాలకు,
కాలి బాటలో పదో పరకకో దొరికే
పనికి రాని వస్తువుని చేసి
అమ్మకానికి పెట్టినా
దుమ్ముపట్టిన గ్రంథాలయాల్లోనో,
ఇంటి పాత అటక మీదనో గిరాటేసి
నా జ్ఞానాన్ని, నా ప్రాణాన్ని
మీ చేతి వేళ్ళతో ఆడించే
చరవాణులలో, కంప్యూటర్లలో
అంతర్జాలపు బందీని చేసి

మర మనుషులై
స్పందన కరువైన మీ మనసుకు,
హృదయానికి నన్ను గుర్తు చేసుకునే
రోజు రాకపోతుందా అని ఆశపడుతూ
మీరు నన్ను దూరం పెట్టినా
మిమ్మల్నిమాత్రం నా గుండెల్లో
దాచుకుంటూ మౌనంగా ఉన్నా !
నన్ను అప్పుడప్పుడైనా
కాస్త పలకరించండి
నాకూ బంధువులున్నారని
లోలోన మురిసిపోతా !
నావైపు అనుకోకుండా నైనా
ఓసారి తొంగిచూడండి
నాకోసం ఎదురు చూసే ఆత్మీయులు
ఉన్నారని సంబరపడతా !
ఎప్పుడైనా గుర్తుంచుకొని
నన్ను కాస్త ప్రేమగా తడిమి చూడండి
అమ్మలా మిమ్మల్ని గుండెకు
ఆబగా హత్తుకుంటా!



-డా. కె. దివాకరా చారి
9391018972

## పంచామృతం

మాట్లాడుకోలేనంత మౌనం
నా చుట్టూ పహారా కాస్తున్నప్పుడు
నేను ఆనందంగా ఉండడం
చెప్పుకోలేనంత ఒక అబద్ధం.

గాలం గవ్వలేస్తుంటే చెరువు
చేప పిల్లకు విందు ఇచ్చినట్లు
పథకాల పంచామృతం చూసి
గెలిపించే పెట్టె హుషారుగ ఉంది

ఋతు రాగం పలికితే
రైతు రాజ్యం నడిచిన జమానాలో
ఎత్తి పోస్తున్న నేటి ఏతం తీరు
మేఘం ముందు ఏతులు కొడుతుంది

చూరుకింద కూర్చొని చుక్కలు
లెక్క బెడుతున్న నిరుద్యోగికి
చక్కబడే రోజులు రాకపోవడం
మదిలో మెరుస్తున్న ఒక విషాదం.



-జోగు అంజయ్య.
8008957480

## అనుబంధాల హరివిల్లు

బంధాలు అనుబంధాలు
కుటుంబ వ్యవస్థకు ఆయువుపట్టు పునాది కావాలి

భార్య భర్తల బంధం సుఖదుఃఖలలో
ఒకరికొకరు తోడునీడై ఉండాలి

నాన్నబంధం బరువు బాధ్యతలను మోస్తూ
అవి పిల్లలకు తెలియచేసేలా ఉండాలి

అమ్మబంధం పిల్లల ఆలనాపాలనా చూస్తూ
ప్రేమామృతాన్ని పంచుతూ తీర్చిదిద్దేలా ఉండాలి

తాతయ్య , అమ్మమ్మ , నానమ్మల బంధం
పిల్లలకు నీతి నియమాలు చెప్తూ
ఆటపాటలతో అల్లుకొనేలా ఉండాలి

తోబుట్టువుల బంధం ప్రేరణ ఉత్తేజాన్ని ఉత్సాహనిస్తూ
తట్టి ముందుకు నడిపించేలా ఉండాలి

స్నేహబంధం మనలోని మంచిని పెంచి
చెడును మాన్పి సద్బుద్ధిని కల్గించి
చక్కబెట్టేలా ఉండాలి

అపుడు అవుతుంది కుటుంబం
ఆనందాల హరివిల్లు లోగిలికి చిరునామా.



-సంధ్య సుత్రావె
9177615967

## స్నేహితుల రోజు తెల్లారినాక !!

ఎంత కన్నీటి రోజో !
స్నేహితుల రోజు తెల్లారినాక
ఒక స్నేహితున్ని కోల్పోయాం !
సాహిత్య సభల జాతరలో
భుజం భుజం రాసుకుంటూ
వేదిక పై పద్య హాసంతో
చప్పట్లను ఆశించకుండా
కరచాలనం చేసేవాడు !
ఐనా చప్పట్లు కురవకుండా
ఎలా ఉంటాయి !
నరసింహుని పద్యం సభలో మేఘమై వర్షమే
భాష్యకాచార్యుల భవ్య
శిష్యరత్నం పండితా సేనాని !
మొన్న మొన్న రెండు
సంకలనాలను మనకిచ్చి
మెప్పులతో మనస్సులో
ఉండిపోయాడు "సిద్దన్న"
వేదిక పై ఎండెల వంశజుడు !
తన సప్తతి వేడుక
మరువలేని కవిత్వంగా
ఇందూరులో పట్టాభిషేకమైంది !
భవిష్యత్తు అన్ని స్నేహితుల
రోజుల్లో స్ఫురణలో నిలిచే
మన "ఎండెల నరసింహ కవి" !
ప్రతి సభలో మన పక్కన
కూర్చున్నట్లే అనిపించదా –
అప్రయత్నంగా కవితాపఠనం
వరుసలో పేరు కూడ
రాస్తామేమో –
"ఎండెల నరసింహులు"
అంటూ వేదిక పైకి రెండు సార్లు
గొంతు సవరించి పిలుస్తామేమో
కవి మిత్రుడు కదా !
ఎలా మరువగలం గళానా...
*(03 – 08 – 2020 నాడు దివగంతులైన కవిమిత్ర ఎండెల నరసింహుని యాదిలో )*



– కందాళై రాఘవాచార్య
9908612007

## మరమరాలు

దోసిటమట్టి
మాట్లాడుతుంటే
నేలమ్మ
నోరు తీపి

ఎదురు చూపులో
ఆతృత అందం
ఎడబాటులో
ఆర్ద్రత భంధం

కలల సమాధిపై
విధి రాత
చెక్కిన అక్షరాలు
మనసుకు సంకెళ్ళు.

ఇష్టం
కన్నీరు పెడుతుంది
ఆలోచనను తెంపే పదును
జన్మకు లేదని

ఆలోచన
ఆవేదన పడుతుంది
ఇష్టాన్ని చంపే శక్తి
మనసుకు రాదని

బంధానికి
బాధ్యత అలంకారం
బాధ్యత బంధానికి
గౌరవం

ఎవరైనా
కావాలని రాస్తే
కవిత్వం కావచ్చు
జీవితం కాకపోవచ్చు.

ఏదైనా
అనుభవించి రాస్తే
కవిత్వం అవకపోవచ్చు
జీవితం కాకుండా పోదు.

మాటలు
మొలకెత్తక మానవు
పచ్చగా
గెలవక ఆగవు.

ఆమె
జవాబు వ్రాయలేని ప్రశ్నపత్రం
అతడికి
జీవితపర్యంతం

ఎన్నో రోజులు ఉడికినదో
మనిషి మాటకు
అంత సువాసన
గుండె వాకిట అంత ఘాటు

ఆవేదన ఆలోచన్ని
డీ కోడితేనే
పశ్చాత్తాప ప్రవాహానికి
మనసులు శుభ్రపడేది.

కళ్ళు అలసేలా
చూపు సోలేసేలా
చూసి చూసి మనసు
గొంతు నులుముకొంది.

కాళ్ళు అరేగేలా
మడిమ బెడిసేలా
నడచి నడచి ఆలోచన
ముఖం ముడుచుకొంది

క్షమించమని అంటే?
మనిషి మారడం కాదు.
మనసు
మరణించడం.

కన్నీళ్ళ రావడమంటే?
బాధ పడటం కాదు
తప్పు
తగులపడిపోవడం

రెండు మత్తు బిళ్లలు
పరిచయం చేసిన 'నిద్ర '
రాత్రిని
జయించింది.
రెండు కళ్ళను

విడచిన 'కల'
పగటిని
రాత్రిగా మార్చింది.

ప్రేమ కాలం చేతికి చిక్కితే
ఆయుధమే
మనసు ముంగిట వాలితే
ఆయువే.

రోజులు ఎంత పాతవైతే
అంత రుచి.
నిజం ఎంత దూరమైన
అంతే దగ్గర.

కడుపు మండిపోయే
మాటలతో
కళ్ళు తెరిపించే బాటలే
కవిత్వం.

నన్ను దూరం చేసుకున్నాను"
అన్న భావన నీకు
రానీయకుండా
దగ్గరగా ఎప్పుడూఉంటాను.

"నేను దూరమయ్యావు"
అన్న భావన నీకు
తెలియనంత
దూరంలో ఇప్పుడు నీవున్నావు.



-చందలూరి నారాయణరావు
9704437247

## గురువు ఋణం

గురువర్యా.... బ్రహ్మలా మా తలరాతలు మార్చారు
విష్ణువులా మా భవితకు మార్గం చూపారు
దైవంలా ఆకలిబాధలు లేకుండా చేశారు
మహేశ్వరుడిలా చదువు మహిమలు తెలిపారు
బడి గుడిలో వెలసిన దైవం మీరు
తరగతి గదిలో మా' గతి'నే
మార్చిన విధాత మీరు
మా లక్ష్యానికి ఊపిరిలూది
జీవితానికే ఆధారమైనారు
ఉన్న స్థితి నుంచి ఉన్నతస్థితికి
చేర్పించే శక్తిమంతులు మీరు
దశదిశలు మార్చి దిశానిర్దేశం
చేసే కాంతిరేఖలు మీరు
మీ జ్ఞానాన్ని, అనుభవాల్ని
రంగరించి పూలబాటలేసే
సమాజ నిర్మాతలు మీరు
మా సామర్థ్యాలు అన్వేషించే
పరిశోధకులు మీరు
విలువలతో కూడిన విద్యనందించింది మీరు
జీవాన్నిచ్చింది తల్లిదండ్రులే అయినా
జీవితాన్నిచ్చింది మాత్రం గురువులే
అందుకే తీర్చుకోలేం మీ ఋణం



-ప్రియాంక దాసరి
9652717548

## నవ్వుల పంటలు

అశేష జనసంద్రంలోనూ
ఏ గమ్యం తెలియని ఒంటరి పడవలా నువ్వుండిపోతే
నీ నవ్వుల నది ఎండి ఇసుక ఎడారిని తలపిస్తుంటే

పూబాలలను చూసినపుడైనా
నీ మనసు పురివిప్పి నర్తించలేకపోతే...
నీకు తల ఎత్తి రంగురంగుల్లో ముస్తాబయి వచ్చిన
హరివిల్లు వంకైనా చూడాలనిపించకపోతే...
ఇళ్ళంతా నిశ్శబ్దం ఆవరించి
అదే ప్రశాంతతని భ్రమింప చేస్తుందంటే...

అప్పుడు ఖచ్చితంగా
చెప్పలేని వేదనేదో
నీ గుండెల్లో తిష్ట వేసుకుని
నీ గుండెను ముక్కలు చేస్తుందన్నట్టే...!
అందుకనే...
మౌనాన్ని ఓ మూటగ చేసి
అనంత దూరాలకు చేరేటంత బలంగా విసిరేసి
కొన్ని మాటల విత్తనాలను వెదజల్లి చూడు...
అక్కడ ఎన్ని నవ్వుల పంటలు పండుతాయో మరి!

అది ఏ మాయా దళారి చేతుల్లోనూ చిక్కకుండా
చూసుకోవలసిన బాధ్యత మాత్రం నీదే సుమీ...!!



-వెగ్గలం ఉషశ్రీ
9440370066

## ధ్వంస ధ్వని

అలను తాకి ఆలకించు
అపురూప నాదాలు
ధరణినాస్వాదించు
దాగి వుంది మమత
అందలాన్ని ఆహ్వానించు
అందించును పులకరింత
అగ్నినారాధించు
యజ్ఞమై మేల్కొలుపు
గాలిని శ్వాసించు

గాంధర్వమై పలుకు
ప్రకృతిలో వనరులన్నీ
పరహితమే కోరు
మానవుడికేమయింది

ఇంత దగాకోరు !
హద్దులు దాటిపోయె
అత్యాశా వికారాలకు
అవధులు కూలిపోయె

పంచభూత ప్రాకారాలకు
ఏ మతం నేర్పుతుంది
అంతులేని అనురాగం
'ధ్వంస ధ్వనే' నేడు
'హంసధ్వని' రాగం



-మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603

## సాధించాలంటే ..?

నేర్చుకునే కాలంలో ఎవరికైనా తప్పవు
తప్పటడుగులు
సరిచేసుకుని పరుగెత్తటమే
ఓటమి ఎన్నో విధాల పరిహసించినా
గెలుపు కై పోరాడటమే
గమ్యసిద్ధికి మార్గం
నిరాశ నిండుగ మబ్బులా కమ్మేస్తున్నా
మత్తు విదుల్చుకోవల్సిందే
ఆశను ఆసరాగా తీసుకోవటం తప్పనిసరి
విజయం జెండా ఎగురెయ్యాలంటే
విడువని పట్టుదల ముఖ్యం
పడద్రోసే వారిని నెట్టుకుంటూ
నిచ్చెన పైకి ప్రాకాలి
సామర్థ్యత
ఆసరా లతలా మలచుకుంటే
జయం మనదే!



-యలమర్తి అనూరాధ
9247260206

## లాక్ డౌన్ వేళలో...!



లాక్ డౌన్ వేళ
ఉన్న పళంగా
పాత రోజుల్లో కెళ్లాం.

రేడియో లో సుప్రభాతంతో
ప్రతి రోజు ఆరంభం
ఇంటిల్లిపాది దూరదర్శన్ లో
రామాయణ్ సీరియల్ చూడటం.

పిల్లలు అష్టాచెమ్మ ఆటల్లో,
పెద్దలు పరమపద సోపాన పటంలో
అంతరార్థాలు వెతుక్కోడం.

మిస్సమ్మ, మాయబజార్,
పాతాళ భైరవి, భక్తతుకారాం వంటి
చలన చిత్ర దర్శనం
ఆ'పాత'మధురమే కదా.

అంబలి, ఆవకాయ,
పచ్చి పులుసు, చింత చిగురు పప్పు,
అరిసెలు, సకినాలు,
నాటి వంటకాలు
నేడు మళ్ళీ
ఆహా ఏమి రుచి.

రాత్రి బినాకా గీత్ మాల
పాటలు వింటూ నిద్రలోకి
జారుకోవడం ఎంత హాయి.

కరోనా చీకటి లో
పాత జ్ఞాపకాలు నాలో
స్థైర్యం నింపే వెలుగు దివిటీలు.!!



-కమలేకర్ శ్యామ్ ప్రసాద్ రావు
9398507940.

## కరోనా లేపిన కల్లోలం

కరోనా కబంధ హస్తాలలో చిక్కి
విలవిలలాడుతున్న విశ్వానికి
విముక్తి ఎప్పుడో...!??

కనిపించని శత్రువుతో
యుద్ధానికి తలపడిన
వైద్య, పారిశుధ్య,
ప్రభుత్వ, రక్షణ దళాలకు
విరామం ఎప్పుడో...!??

ఇంటినివీడక మింటిని చూస్తూ
ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని
గుట్టుగా కాలమెల్ల దీస్తున్న
మానవాళికి, బయటి ప్రపంచముతో
బాంధవ్యాలు కలిసేదెప్పుడో...!??

ఛిన్నాభిన్నమైన ప్రపంచ
ఆర్థికవ్యవస్థ అనారోగ్యం నుండి
కోలుకునేదెప్పుడో...!??

మహమ్మారి మాయలోపడి
అనునిత్యం గాలిలో కలిసిపోతున్న
ప్రాణాలకు సంపూర్ణ బరోసా ఎప్పుడో...!??

పగలూ,రాత్రి కర్ఫ్యూ విధింపుతో
సామాజిక దూరాన్ని పాటిస్తున్న
జనజీవనానికి సడలింపు ఎప్పుడో..!??

తారతమ్యమెరుగక తాకితే సోకేటి
మాయదారి రోగానికి
మందు కనిపెట్టేదెప్పుడో...!??

అందరూ చైనా వస్తువులు
నకిలీ అంటారు
అందుకేనేమో నాణ్యతను
వైరస్ లో చూపారు చైనావారు
కంటికే కనపడదు
తాకెతేవిడువదు...!!

ఇదంతా చైనావైరస్ కరోనా లేపిన కల్లోలం
చేస్తుంది అవని అంతా విలయతాండవం
ధరణిలో ఎటుచూసినా రోగులమయం
జరుగుతుంది అలుపెరుగని మారణహోమం
ఎపుడుచూపునో భగవంతుడు
ఈ సమస్యకు మోక్షమార్గం.....!!



-ఎ.వెంకటరమణ
సెల్ : 94417 17212

## కరోనా వలలో భాగ్యనగరం

ఆరు దశాబ్దాలు అఖండ తెలుగు జాతిని
అక్కున చేర్చుకుని అలరించి ఆదరించిన
అపురూప నగరం మన భాగ్యనగరం
నేడు కరోనా వలలో చిక్కుకుని విలవిల్లాడుతోంది..
నిన్నా మొన్నటి దాకా కళ కళలాడిన వీధులు
నేడు అంగళ్లు మూతబడి వెల వెల బోతున్నాయి..

దేవుడా నా నగరాన్ని జనంతో నింపు
అని కోరిన కులీ కుతుబ్ షా కోరికకి మించి
ప్రాంతాలకతీతంగా చేరిన వలసల వెల్లువతో
కోటిమించిన జనాభాతో కళకళలాడింది భాగ్యనగరం..
కులమతాల కుతంత్రాలెరుగక
సమనాశ్రయమిచ్చింది ఈ మహానగరం..

క్యాభాయ్ అని పలకరించే కరీం భాయ్ కబుర్లు
నమస్తే అన్న అని నవ్వుతూ చెప్పే మల్లేషన్న ముచ్చట్లు
ఎక్స్క్యూజ్ మీ అని ఎదురొచ్చే సాఫ్ట్వేర్ ఇంజనీర్ల హైటెక్కు సోకులు
ఏవి తల్లీ నిరుడు విరిసిన సరస విలాసాలు..
వర్క్ ఫ్రమ్ హోమ్‌తో కలుగులోకి దూరిన వేతన జీవులు...

నిన్న ఇంటికొకరు పోటీ పడి అమెరికాకు
పరుగు తీసినపుడు హైదరాబాదంటే చులకనైపోయింది

నేడు కరోనా విలయం కరాళ నృత్యం చేస్తుంటే
హైదరాబాదు చేదయిపోయింది
పాలిచ్చినపుడే తల్లంటే ఎలా?
వెలుగున్నపుడే ఇల్లంటే ఎలా?

ఎవరక్కడ? మహానగరానికి టులెట్ బోర్డు తగిలించి
సురక్షిత ప్రాంతాలకు తరలి పొమ్మంటున్నది..
స్వీయ నియంత్రణ లేని
విచక్షణారహిత మానవులను
ఈ భూమండలంలోని ఏ మండలం రక్షిస్తుంది?
ఏ కమండలం కరోనాని తరిమికొడుతుంది..?



-సోమవరపు రఘుబాబు
సెల్ : 9441457099

## మనసుకు పొర

ధరించు మాస్క్ ముఖానికి మాత్రమే
మనసుకు వేయకు కపటపు పొరను

కనపడని క్రిమితో పోరాటం సలుపు
కనపడే రోగిని వెలి వేయకు చెంతనుండి

అధరము దరహాసం చిందించినా
అంతరం ను కలుషితం చేయకు

తీయని పలుకులు పలుకుతూ
విషమును చిందించకు మరో ప్రక్క

కలువ కన్నులు కరుణనే చూపాలి
కాఠిన్యపు వైఖరిని కానే కాదు

ఆత్మనే దర్పణమై వేలెత్తి చూపుతుంది
తప్పు లెన్ని నీలో ఉన్నా !

అంతరాత్మను నమ్ముకుని నడిస్తే
అచ్చమైన స్వచ్ఛమైన మార్గమే నీది

మాస్క్ నిరోధకము క్రిములు దరి చేరకుండా....
తెరచి ఉంచు మనసును
అంతా కనిపిస్తారు మనంగా!



-లక్ష్మి మదన్
9959186838

## మార్పు సహజం

గత కొంత కాలంగా
కోమాలోకెళ్లిన నేను
ఈ మధ్యే కోలుకుని
కడప దాటిన..

ఎంతో మంది ఎదురుపడ్డరు
ఎక్కడా చిరునవ్వుల
పలకరింపులు లేవు
మాస్కుల మాటున
దాగిన ముఖారవిందాలు
అంతటా కనుసైగల వీడుకోల్లే
కరచాలనమైనా కానరాలే
కరోనా కరుస్తోందని
కరాఖండీ కబుర్లు..
అందచందాల మోజులు లేవు
ఆస్తిపాస్తుల ఫోజులు
అసలే లేవు
ఇప్పుడు అందరి నోటా ఒకేమాట
ఆరోగ్యమే మహాభాగ్యమని
పరిశుభ్రతతోనే
మన ప్రాణం పదిలమని..

స్వప్నంలో కూడా
ఊహించని మార్పు
కనుల ముందు
కదలాడేసరికి
ఇక చేసేదేముంటది..
మార్పు సహజమేనని
నా మనుసుకు సర్దిచెప్పుకున్న...
-బస్వ రాజ్ కుమార్



-బస్వ రాజ్ కుమార్
9392006080

## కరోనా హెచ్చరిక

మీ మీ దూరాన్ని ఎడబాటు చేసి
ఖాళీ రోడ్లన్నీ చుట్టేశా
దుకాణాలన్నీ మూసి ఉన్నా
అత్యాశతో బయటకు వస్తారని ఆశ

నేను మీ దగ్గరికి చేరడానికి నా ప్రయత్నాలు ఎన్నెన్నో
నా ఆత్రుత వైద్యశాలలో ప్రవేశ కోసం
రకరకాల మందులకు భయపడకుండా
గేటు ముందు తిష్ట వేసి లోపలికి ప్రవేశిస్తా

మీరిచ్చిన ఉదయకాల సమయంలో
కూర గాయల బజారులలో
ఇతరత్రా దుకాణాలలో
గుంపులు గుంపులుగా వచ్చే వెర్రి జనం కోసం
నేను అడ్డంగా నిలబడే ఉంటా

నాకు సోకదులే అనుకునే వెర్రిబాగులోడి కోసం
నా విశాల హృదయ కౌగిట్లో
మీ మృతదేహాలను పదిల పరుచుకుంటా
త్వరగా రండి చావును పరిచయం చేస్తా
నీ రాకకై నా నిరీక్షణ
మీ జాగ్రత్తలో మీరుంటే
నా జాగ్రత్తలో నేనుంటా



-దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు
సెల్ : 94930 33534

## చేతిసంచి

పొద్దుపొద్దునే పనిముట్లు అమరిన
ఆ చేతిసంచి
బస్తీ నుంచి నగరానికి పరుగు పెట్టేది....

ఓ ఇంట్లో ఫ్యాన్ ఆ పక్కింట్లో ఏసి
అటు పక్కింట్లో కూలర్తో ముచ్చటించేది.....
పనిముట్ల సాయంతో బాగోగులు చర్చించేది.....

పనితీరు మెచ్చుకున్న వాటన్నింటికీ
టాటా చెప్పి చేతిసంచి భద్రంగా బస్తీ కెళ్లేది.....
అలసిన పనిముట్లని నిదురపుచ్చి
ఓ మూలన ఒదిగి పోయేది.....

ఇపుడు,
నగరం దారిన కరోనా కంచె మొలిచింది
ఇళ్లన్నీ దూరం దూరం జరిగాయి
ముచ్చట పెడదామన్నా –
బాగోగులు చర్చిద్దామన్నా –
చేతిసంచి చుట్టూతా అన్లాక్డ్ అనుమానాలు...

తుప్పుతో,ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతూ –
నట్టు బోల్ట్ తో స్క్రూ డ్రైవర్ పానతో
పనిముట్లన్నీ ఒక దానితో మరొకటి
బాధ చెప్పుకుంటూ ఉంటున్నాయి.....

చేతిసంచి మొత్తంగా తెరిచేదెపుడో
అన్లాక్లో అనుమానాలు తీరేదెపుడో
చెప్పాలని పనిముట్లు ప్రశ్నిస్తున్నాయి......

–అశోక్ గుంటుక
9908144099

## చేతికర్ర

దండమున్న చేత దశవిధ ఫలితమ్ము
లుండుననిరి బుధులు ఖండితముగ;
బుధుల నోటిమాట పొల్లుపోవున అది
అనుభవమున చెప్పినట్టి మాట!

తెలివి గలుగువారు పలువిధమ్ములవాడి
కర్ర వలన పొందగలరు మేలు;
కర్త స్థాయిబట్టి కర్మ ఫలమ్ముండు
శస్త్ర మౌను కర్ర,అస్త్ర మౌను!

కానరావు చేతికర్రలు నగరాల
లోన,పట్టణాలలోన తరచు;
నాగరులకు నచ్చునా నాటు కర్రలు?
స్టిక్కు లుండు వారి చేతులందు!

చేతనున్న స్టిక్కు ఊతకర్రౌగాని,
చేతికర్ర సాటి చేయ దెపుడు;
పలువిధాల తనకు పనికివచ్చెడి చేతి
కర్ర పట్టుకొనును కర్షకుండు!

చేత కర్రలేక రైతు చేనికి పోడు,
కర్ర మనిషి తోడుగా రహించు;
హస్తభూషణముగఅలరారు కర్రరై
తన్నచేత బట్టుకొన్నయంత!

కర్ర చేతనున్న కరవవచ్చిన కుక్క
తోకముడిచి దారితొలగి చనును;
కుంటికుక్క గూడ వెంటాడి తరుమును
లేనియెడల చేతిలోన కర్ర!

ఆత్మరక్షణమున కప్పుడప్పుడు కర్ర
యెంతయేని ఉపకరించుచుండు;
ముదుసలులకు కర్ర మూడవ కాలు,
వ్యాంగులకును నది సహాయకారి!



-హెచ్.ఆర్.చంద్రం
9493248053

పుస్తక సమీక్ష

# మనో సంఘర్షణల సమాహారం..!

కదులుతున్న కాలంలో
జారిపోయే స్మృతులకు
ఆనకట్ట నా కవిత్వమని వినమ్రంగా
ప్రకటించుకున్న కవయిత్రి భానుశ్రీ కొత్వాల్‌గారు 'మొలక' పేరుతో తమ మొదటి కవితా సంపుటిని వెలువరించారు.

**"చుట్టూ మురిసిన**
**మోసాలను ఛేదించే**
**ఆయుధం నా కవిత్వం"** అని భావించే ఆమె.. స్త్రీగా.. తమ అనుభూతులను.. అనుభవాలను.. అంతరంగంలో కదలాడే సంఘర్షణలను. ఇతరత్రా సంఘటనలను ఏకరువు పెడుతూనే.. మధురోహల మృదు మధుర హృదయ బృందావన పదబంధాలతో కవితలనల్లి.. మెప్పించారు.

తమ కవిత్వం ద్వారా బాధిత స్వరాన్ని వినిపిస్తూనే.. మింగుడుపడని వేల వేల అహంకారుల చరితలను ఎండగట్టారు.

కవిత్వానికి ఆత్మగౌరవమే.. గొంతుకై పాదమై.. పద్యమై గీతమై ఎరుపెక్కిన కిరణమై పరుగెత్తి తలెత్తి నిగ్గదీసి ప్రశ్నించాలి భావించే కవయిత్రి భానుశ్రీగారు ఇందలి కవితల్లో అక్కడక్కడ సమసమాజాన్ని ప్రశ్నిస్తూ తమ భావాలను మనతో పంచుకున్నారు.

సమాజంలోని వివక్షతలను.. అసమానతలను అన్యాయాలను, అక్రమాలను భానుశ్రీగారు సమర్థవంతంగా ఎత్తిచూపారు.

స్త్రీల యొక్క బాధలను.. వారిపై జరిగే అఘాయిత్యాల్యలను, వారిపై జరిగే వేధింపులను.. తమ కవిత్వం ద్వారా తెలియజెప్పారు. పిల్లలపై ప్రేమ.. ప్రకృతిపై మమకారం.. పీడిత జనం పట్ల సానుభూతి, వంటి అంశాలతో ఆమె కవిత్వం పెనవేసుకుంది.

భానుశ్రీగారు బాధితుల పక్షాన నిలిచి.. వారి వ్యథలకు అద్దం పడుతూనే.. స్వాభిమానంతో మహిళలు యోధులుగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఇందలి కవిత్వంలో కవయిత్రి యొక్క సున్నిత మనస్తత్వం.. ఉత్తమ వ్యక్తిత్వం.. సునిశిత లోక పరిశీలనం ముప్పేటా అల్లుకుపోయాయి.

'అపరవేదం' శీర్షికతో రాసిన మొదటి కవితలోనే అమ్మ యొక్క ఔన్నత్యాన్ని చాటి చెప్పారు. కనిపెంచిన దైవానివి.. కనిపెట్టి కాచే కంచెవి.. కరుణార్ధ్ర హృదయాలవి.. బ్రహ్మను మించిన విధిరాతవి అంటూ అమ్మను కొనియాడారు.

'ఇచ్ఛ' కవిలో కవయిత్రి తమ మనసులోని కోరికను వెల్లడి చేస్తూ.. వాడిన మొక్కను తిరిగి నాటాలనిపిస్తుంది. తెగిన గాలిపటాన్ని తిరిగి అతికించాలనిపిస్తుందంటూ ఆశావహ దృక్పథాన్ని ప్రకటించారు. చీకటిలో మగ్గిన మనసుకు వెలుగు నివ్వాలని కాంక్షించారు.

నాన్నను మహాయోధుడిగా పేర్కొంటూ.. రాసిన కవితలో తండ్రీ..

**"నీ అస్థిత్వ పోరాటంలో**
**నిస్సత్తువ కాలేదెన్నడు**
**మూలాన్ని కలిపేసిన**
**నిజమైన నిత్య యోధుడివి నువ్వే..**
**ఎప్పటికీ..**
**మహనీయుడివే** అంటూ నాన్నపై కవయిత్రి తమ గౌరవాన్ని చాటుకున్నారు.

'నెత్తుటి సాక్ష్యం' కవితలో కోరిక తీరిన స్వార్థం..తో







నీ శ్వాస ప్రశ్నార్థకమైందంటూ.. చెట్ల పొదల్లో నిర్దాక్షిణ్యంగా వదిలేసిన పసిగుడ్డును ప్రస్తావిస్తూ రాశారు. 'అమృతం' కవితలోని పంక్తులు ఆర్ధ్రంగా మలచబడ్డాయి.

**బ్రతుకు దెరువుకై నడిచే నీ జననీ**
**నీకు పట్టించే అమృతధారకై**
**పుట్టెడు తప్పిలురా!** అంటూ కొనసాగించిన పంక్తులు అందరినీ కదిలిస్తాయి.

'ప్రసవ వేదన" కవితలో పుట్టెడు పురిటినొప్పి
నెత్తుటి వానై..
నవ మాసాల అనుభూతుల అల్లికను
శోధన సునామీలన్నీ
గర్భం చుట్టూ మోహరించినా.. భీకర ప్రతిజ్ఞతో అలుపెరుగని ప్రకంపనాల తరంగాల ఆటుపోటుల నడుమ సాగే వేదనకు అక్షరాకృతినిచ్చారు.

భ్రూణ హత్యలను నిరసిస్తూ 'జీవన తంత్రి' కవితను రాశారు.

ఇల్లాలికి గృహమే స్వర్గసీమ అంటూ 'ఎదురు చూస్తూనే' కవితలో మహిళను గరిటె త్రిప్పే గడుసరిగా చేసి.. నీకేం తక్కువ అంటూ ఊరించడం పట్ల కవయిత్రి తమ ధిక్కార స్వరాన్ని వినిపించారు.

**సంసార రైలెక్కించి**
**స్వేచ్ఛను హరించి కూర్చోబెట్టారు**
**ఇప్పుడామె విశ్రాంతి లేని**
**చెమట చిందించే చిత్తరువై**
**చీకటి కూపంలో చిక్కి**
**అందరి అవసరాలు తీర్చే**
**ఓ మౌన విహంగం** అని వ్యాఖ్యానించారు.

'జీవశిల" కవితలో వేశ్యగా చలామణి అవుతున్న అతివల కష్టాలను వేదనా భరితంగా అక్షరాల్లో బంధించారు.

**యవ్వనం బలహీనమై**
**వెలిసిన దేహ చిత్రానికి**
**అనేక కృత్రిమ వర్ణాలద్దుతున్న అలసిన తార**
**రాత్రి మంచంపై**
**చిరుగుల దుప్పటై**
**కోరిక తీర్చుకున్న నీడ**
**విసిరిన కాసులు ఏరుతూ**
**అందమైన కలలన్నీ అపహాస్యం చేస్తుంటే**
**కుంచించుకుపోతూ**
**చెదిరిన చీరను సర్దుకుంటుంది.**
**అస్థిపంజరానికి కప్పిన**
**చిల్లుల దుప్పటి ఆమె '** అంటూ రాసిన పంక్తులు అందరినీ ఇట్టే కదిలిస్తాయి.

"జాగృతి" కవితలో
**కన్నీటి వేసవి మంటలకు**
**తొలకరి చినుకును రమ్మంటుంది**
**మనసున్న వారిని కలుపుకుని**
**జన జాగృతికై నడుం బిగించమంటుంది**
**ఏం చేయను మిత్రమా!**
**ఓ అదృశ్య శక్తి ఏదో**
**నా మనోశాలలో**
**తిష్ట వేసుకుని కూర్చుంది** అంటూ ఆలోచనాత్మక ముగింపునిచ్చారు.

'జ్వాల' కవితలో..
**విశ్వాసం నమ్మకం లేని**
**విష పంజరంలో**
**రెక్కలున్న ఫలితమేమున్నది..**
**'ఆడదేహం" కామకేళికి**
**'ఆడమనసు' ఆట విడుపుకే**
**అనుకుంటున్న మూర్ఖులు**
**తానే శూన్యంగా మిగిలాక**
**తన ఉనికి ప్రశ్నార్థమైనాక**
**జ్వాలగా ఎగిసి పడకపోతే ఎలా?** అని ప్రశ్నించారు.

మసక బారుతున్న మానవత్వంకు అద్దంపడుతూ "మాయ" కవితను ఈ పుస్తకంలో పొందుపరిచారు.

కవితకేదీ కాదనర్హం అని శ్రీశ్రీ గారన్నట్లు..

భానుశ్రీగారు 'దినపత్రిక' కవితను రాసి సృజనను చాటారు.

**పొద్దున్నే పలకరించే**
**ప్రేమమయి పత్రిక**
**మా ఇంటి**
**తొలిపొద్దు పుత్రిక"** అంటూ రాసిన పంక్తులు బాగున్నాయి.

మానవారణ్యంలో.. పసిమొగ్గలను చిదిమేయడానికి.. మనిషి ముసుగేసుకున్న మృగాళ్ళు సంచరిస్తున్నారంటూ తమ బాధను వ్యక్త పరుస్తూ "మృగారణ్యం" కవితను రాశారు.

**"ఆడపిల్లల మనసును**
**మొగుడు చుట్టూ తిప్పే**
**మాయదారి తంత్రం**
**గోరింటాకు వ్రతం'** అంటూ "గోరింటాకు" కవితను తీర్చిదిద్దారు.

**మనసుపై అక్షర షామియానాలు వేసి**
**కవన కనకాంబరాలు కూర్చి**
**తెలుగు తల్లి సిగలో చేర్చాలంటూ..**
**అక్షరం విభిన్న కోణాల్లో చైతన్య పరుస్తుందో** ఓ కవిత ద్వారా విడమరిచి చెప్పారు.

'కాయకు తీర భారమా" కవితలో జీవితమనే ప్రవాహంలో కాలమిచ్చిన బహుమతి వృద్ధాప్యం అని చెబుతూ..

**వృద్ధాశ్రమాల్లో తారాడుతున్న**
**అనుభవాల గనులను చూస్తుంటే**
**మనసు కల్లోల భరితమవుతుందని వాపోయారు.**

**ఇంకో కవితలో మా ఊరి కల్పవల్లి** అంటూ తమ ఊరి చెరువును కంటి వెలుగంటూ కొనియాడారు.

"మొలక" కవితలో స్వాభిమానాన్ని చాటారు. ఆత్మ విశ్వాసాన్ని నింపారు. ఆశావహ దృక్పథానికి పట్టం కట్టారు.

**రేయిపగలు కష్టించి చదివిన**
**జ్ఞానసారాన్ని**
**అజ్ఞానంలోకి విసిరేస్తూ**
**బలహీన క్షణాలను**
**వివేక చైతన్య వీచికలతో**
**పారద్రోలక**
**తలవంచిన మొలక**
**నేడు కన్నీరిస్తుందని** తమ వేదనను వ్యక్తపరిచారు.

తెలిసీ తెలియక.. 'ప్రేమ' వలలో చిక్కుకుని తమ జీవితాలను అంధకార బంధురం చేసుకోవద్దన్న హితవు ధ్వనించేలా ఈ కవితలోని పంక్తులను తీర్చిదిద్దారు.

**మనసు మాలిన్యం వీడి**
**పెద్దల అండతో**
**ఓ మొలక!**
**నిన్ను నీవు దిద్దుకో"** అంటూ సూచించారు.

కవయిత్రి భానుశ్రీగారు 'ప్రకృతి చిత్రం' కవితలో తమ భావుకతను ప్రదర్శించారు. 'అనుభూతుల పొదరిల్లు' కవితలో..

**కనుల కొలనులో**
**కల్లోలం తప్ప**
**కరుణలేని కఠిన మనస్సులు**
**కొలువైన కోవెల**
**ఎంత అద్భుతంగా ఉంటేనేమి**
**దైవం లేని ఆలయం**
**అలలు లేని సంద్రం**
**ప్రేమలేని హృదయం**
**సంతోషం వికసించని గృహం**
**ఆత్మలేని దేహం ఒకటే కదా!** అంటూ మంచి సందేశాన్ని ఇచ్చారు.

ఇలా కవియిత్రి భానుశ్రీ కొత్వాల్‌గారు ఈ పుస్తకం నిండా తమ మనో నేత్రంపై నాట్యం చేసే సంఘర్షణలను కవిత్వంగా మలిచి మనకు అందించారు. ఆలోచనాత్మక ముఖచిత్రం పుస్తకానికి నిండు శోభను కూర్చింది.

కవయిత్రి ఎంపిక చేసుకున్న కవితా వస్తువులు బాగున్నాయి. అభివ్యక్తీ బాగుంది. అయితే శిల్పం.. మరింత గాఢత గురించి శ్రద్ధ వహిస్తే మంచి కవయిత్రిగా నిలదొక్కుకోగలదన్న విశ్వాసం ఉంది.

అధ్యయనం ద్వారా తమ కలానికి ఇంకా పదును పెట్టుకుని ముందు మరింత బలమైన కవిత్వాన్ని అందిస్తారని ఆశిద్దాం.

ప్రతులకు: భానుశ్రీ కొత్వాల్
ప్లాట్ నెం.04,
అదర్శకాలనీ, రవీంద్రనగర్
నల్లగొండ-508 001
సెల్: 9866 63913



– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## గుడి బడి కరోనా? !

పొడిచే పొద్దు
మోగని గంట
నిద్రలేవని పిల్లాడు
నిద్రలేమితో పంతులు
విధులున్న వెళ్ళలేని బడి పంతులు
విధులతో విలువైన గుడిలో పంతులు
పిల్లలు లేని బడి
భక్తులు కానరాని గుడి
రెండూ మూసే ఉన్నాయి ఈ ముసురులో
ముసురు కాదు ముచ్చట
ముచ్చెమటలు పట్టిస్తున్న
మహమ్మారి వైరస్

విలువైన జీవితం
వింత బ్రతుకు గా మారే
మరిన్ని రోజులు మసలగలమా అని
మదిలో మొదలైయ్యే
మాయదారి ఆలోచన
మూతి మీద మాస్కు లేకున్నా
మీటర్ దూరం పాటించకున్నా
అంటు రోగం కాకపోయినా
అందిన కాడకి దోచుకుపోయినట్టు
అంటుకున్న వారేకాక
అందరూ ఆందోళనలో ఉంటున్నారు.. !

దేశ దేశాలు తిరిగి వచ్చి
మన దేశంలో తిష్టవేసిన నట్టు
అడ్డు అదుపు లేకుండా తిరుగుతున్న
బడాయి బాబుల సరసన చేరి
అందరినీ ఓ ఆట ఆడిస్తున్నది ఈ కరోనా

అలుపు లేకుండా ముసురు మేఘాలు
కురిసే వానలా
మాములు రోగంవలే
ఆ ఊరు ఈ ఊరు అని లేదు
ఆడు పెద్ద ఈడు చిన్న అనీ లేదు
అడ్డు వచ్చినోడి నోట్లో కెళ్తా
నోటి నుంచి కడుపులో కెళ్తా
నా స్థితి మార్చుకుని కంట్లో కెళ్తా
గాలి ద్వారా నైనా లోనికొస్తా
ఊపిరి ఆపేస్తా ఉగిసలాడిస్తా
ఉలుకు పలుకు లేకుండా చేస్తా
అంటూ ఉవ్వెత్తున లేచిన కెరటంలా
తన ప్రతాపం చూపిస్తుంది ఈ కరోనా.

ఊరు ఊరు వచ్చినా
దేశ దేశాలు కలిసి
యుద్ధ సామాగ్రి బాంబులులతో పోరాడినా
పోటీలో నాదే పై చెయ్యి అన్నట్టుగా
ఆటం బాంబు కంటే ప్రమాదంగా ఉన్నా అంటూ
అలీ, పిల్లలతో ఇంట్లో కూర్చో పెట్టింది ఈ కరోనా.

అరుగున కూర్చోవాలన్న అనుమానంతో
అనుక్షణం అయిన వారిని సహితం
నమ్మలేని మనస్తత్వంతో
అనుమానం పెద్ద రోగం కాదు,
నేడు అది నిజమే అని నిరూపిస్తుంది.

ఈ కరోనా కథ ముగిసేదెప్పుడో
ఈ కల్ల బొల్లి మాటల మందులు వచ్చేదెప్పుడో
బడి గంటలు మోగేదెప్పుడో
గుడి గంటల సవ్వడి ఎప్పుడో
ప్రైవేటు బడి పంతుళ్ళకు జీతాలెప్పుడో
గుడిలో పంతుళ్ళ ఆశ తీరేదెప్పుడో
ముసురు పట్టి ఎండిన గడ్డి చిగురించినట్టు
చీకటి మయమైన
విలువైన చదువుల జీవితాలు చిగురించేదెప్పుడో..



-సుధాకర్ గుమ్మడి
9440125495

## నవ జీవన యానం

కాలం సర్పమై కాటేస్తే...
కరువు మృత్యువై చుట్టేస్తే...
ఉన్న ఊరిలో బతుకు దెరువు లేక
ఆశల రెక్కలు తొడుక్కుని
"వలస" పక్షివై ఎగిరిపోయావు
కరోనా విసిరిన పెను విపత్తుకు చెదిరి
తిరిగి సొంత "గూటి "కి చేరుకున్నావు
ఇపుడు గాయాల తడిమి చూస్తే మానిపోవు
పొగిలి పొగిలి దుఃఖిస్తే బతుకు తెల్లారదు
ఎక్కడ పడిపోయావో అక్కడే నిలదొక్కుకోవాలి
ఎక్కడ పోగొట్టుకున్నావో అక్కడే వెతుక్కోవాలి
ఏ ఆధారం లేని వేళ ఉన్న "ఊరు"దిక్కయింది
నువ్వు కాదనుకున్న "పల్లె" కన్నతల్లై చేరదీసింది
అవును ! నువ్వనుకుంటున్నట్లు...
ప్రపంచీకరణ " పిశాచి " వేటుకు
బహుళ జాతి " రక్కసి " కాటుకు
పల్లె మోడుబారి నేలకొరిగింది నిజమే !
అంత మాత్రానికే "చరితం" ముగిసినట్లు కాదు
ఏదో ఓ రోజు కాలం తప్పక కలిసి వస్తుంది
పల్లె మళ్ళీ "చిగురు" తొడుగుతుంది

అయినా ఈ విపత్తులేవి శాశ్వతం కాదు
ఈ కష్టాలు కన్నీళ్లు కడదాక ఉండబోవు
నీలో నెత్తురు ఉంది "సత్తువ" ఉంది
కాయ కష్టంజేసే " తత్వం " ఉంది
అంతకు మించి "ఆత్మ " విశ్వాసం ఉంది
అనుకున్నప్పుడు ఈ కలవరపాటెందుకు?
ఈ నిరాశ నిస్పృహల కుంగుబాటెందుకు?
ఇప్పటికైనా కొత్త ఆశలు పొదుపుకొని
కొంగ్రొత్త ఆశయాలు నిర్దేశించుకొని
పుట్టుక నిచ్చిన " గడ్డ " మీదే...
నవ జీవన యానం సాగించు



– కోడిగూటి తిరుపతి
9573929493

## మహోన్నతుడు మాహీ

అత్యున్నత క్రికెట్ దిగ్గజం
టీం ఇండియా సారథి
మ్యాచ్ల గెలుపుకు వారధి
ఎన్నో మ్యాచులను అలవోకగా నెగ్గిన నిగర్వి
ఓర్పు నేర్పులకు చిరునామా
వ్యూహాలు పన్నుటలో దిట్ట
అతనికి సొంతం మ్యాచ్ విజయాల చిట్ట
ఎన్నో క్రీడాకారులకు ఊరట
ఆలంబన ప్రేరణ
తోటి ఆటగాళ్ళ క్రీడాసక్తిని ,పటిమను
ఎరిగిన మాంత్రికుడు
తదనుగుణంగా వారిని ఉపయోగించి
విజయాల పరంపర సాగించిన ధీరుడు
కెప్టెన్ కూల్ గా,ధనాధన్
హెలికాప్టర్ షాట్స్ మాహీ స్టైల్ గా
ఝార్ఖండ్ డైనమైట్ గా
రాంచీ వీరుడిగా పేరొంది
ఐసిసి ట్వెంటీ ట్వెంటీప్రపంచకప్ 2007
ఐసిసి ప్రపంచకప్ 2011
ఛాంపియన్ ట్రోఫీలను నెగ్గినా
అంతర్గతంగా అద్భుతఫుట్బాల్
ఆటగాడిగా ఉండి
పద్మశ్రీ, పద్మభూషణ్,
రాజీవ్ ఖేల్ రత్న అవార్డులతో





గౌరవడాక్టరేట్లతో అలరారి
సాక్షికి వరమై ,జీవాకు వశమై
అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శిస్తూనే
ఎవరి ఊహలకందకుండా
ఆశ్చర్య పరుస్తూ
పంద్రాగస్టు పర్వదినాన
తన రిటైర్ మెంట్ ప్రకటనను
తనదైన రీతిలో
ఎవరికి ఏది శాశ్వతం కాదు
పాత దాని స్థానే కొత్తది
తప్పక వస్తుంది,ఇది ఒక
నిరంతరం ప్రవాహ ప్రక్రియ
అని తత్వం ఉట్టిపడే పాటను
జోడించి అందరి హృదయాలను ద్రవించేలా
గౌరవంగా ఆటనుండి తప్పుకొంటున్నానని
ప్రకటించిన ఆదర్శుడు మహేంద్రసింగ్ ధోని
నిజంగా మహోన్నతుడిగా
మహి చరిత్రలో నిలుస్తాడు.



-సంధ్య సుత్రావె,
9177615967

# కరోనాకు తోడు వరద విపత్తు

హైదరాబాద్, ఆగస్టు 19:ఇటీవలి వర్షాల భయం ఇంకా తొలగి పోలేదు. ఇప్పటికే లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్న వర్షాల కారణంగా అన్నదాతలు ఆక్రందన చెందుతున్నారు. వర్షాలు వస్తే ఓ బాధ..రాకుంటే మరో బాధలా అన్నదాతల పరిస్థితి తయారయ్యింది. వరి, పత్తి,వేరుశనగ, శనగ, పెసర, కంది పంటలు నీట మునిగాయి. తెలంగాణలో నియంత్రిత సాగుతో సంబరపడ్డ రైతులకు కష్టాలు తప్పడంలేదు. భారీ వర్షాల కారణంగా అనేక జిల్లాల్లో పంటలు నీట మునిగాయి. ఈ వర్షాలు ఇంకా కురుస్తూనే ఉండడంతో పంటలు మురిగిపోతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. యాభై ఏళ్లలో ఇంతటి వర్షం రాలేదని కూడా అనుకుంటున్నారు. దీని వల్ల నష్టం అపారంగా ఉంటుందని అన్నారు. అయితే చెరువులు కుంటలు నిండడంతో దీర్ఘకాలికంగా ఉపయోగమే ఉంటుందని కూడా భావిస్తున్నారు. కరోనా, వర్షాకాలపు వ్యాధులు, వరదలు ఈ మూడింటిని ఏకకాలంలో ఎదుర్కొనేందుకు ఇప్పుడు ప్రభుత్వాలు సిద్ధపడాలి. కరోనా భయాందోళనల నేపథ్యంలో ఈ వర్షాలు అదనపు భారం కానున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ గోదావరి ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నది. మునుపెన్నడూ లేనంతగా వరంగల్ నగరం నీట మునిగింది. దీంతో చెరువులు,కుంటలు ఎలా ఆక్రమణలకు గురయ్యాయో వరంగల్ ఘటన కళ్లకు కట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరీతీర ప్రాంత గ్రామాలన్నీ ముంపును చవిచూస్తున్నాయి. లంక గ్రామాలు నీట మునిగాయి. ఐదునెలలుగా కరోనా మహమ్మారి కారణంగా జనజీవనంలో వచ్చిన మార్పులకు తోడు, ఈ తీవ్రవర్షాలు ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్నాయి. గోదావరి వరదలకు పంట మునిగి నష్టపోయిన అన్నదాతలు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని వరద ప్రాంతాల్లో పర్యటించిన మంత్రులు, ఎమ్మెల్యేలు హామీ ఇస్తున్నారు. గోదావరి తీర గ్రామాల్లో వరదకు నీట మునిగిన వరి పొలాలు, పత్తి చేన్లు దర్శనమిస్తున్నాయి. వరద తాకిడికి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షానికిఅనేక చోట్ల ఇండ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులు తమను ఆదుకోవాలని, గోదావరి వరదకు తాకిడికి పెద్ద మొత్తంలో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. తమకు న్యాయం జరిగేలా చూడాని కోరారు. ఏజెన్సీలో వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం వివరాలు సేకరించడం జరుగుతుందని హామీ ఇస్తున్నారు. వరదలు వచ్చినప్పుడు శాశ్వత సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉన్నా పాలకులు ఎప్పుడూ తాత్కాలిక చర్యలతోనే సరిపుచ్చుడంతో సమస్య నిరంతరంగా ఉంటోంది.

సమస్యను శాశ్వతంగా పరిష్క రించే ఆలోచన చేయకుండా, ఏటేటా వరదలు వచ్చినప్పుడు సహాయకార్యక్రమాలను అమలు చేయడం మీదనే రాజకీయ పక్షాలు ఆసక్తి చూపుతున్నాయి. విపత్తులను ఎదుర్కొనడానికి శాశ్వత వ్యవస్థలు ఉండాలని, ఒక వ్యూహం అవసరమని గుర్తించడం లేదు. దేశంలో విపత్తు నివారణ చట్టాన్ని రూపొందిం చారు. విపత్తుల నిర్వహణా వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ఇప్పటికీ పూర్తిస్థాయి యంత్రాంగం ఏర్పడలేదు. విపత్తుల నిర్వహణ అన్నది ప్రాణ, ఆస్తి నష్టాలను సాధ్యమైనంతగా తగ్గించడానికి జరిగే ప్రయత్నమే తప్ప, విపత్తుల సందర్భంగా శాశ్వత చర్యలకు అవకాశం ఏర్పడడం లేదు. నాలుగు దశాబ్దాల కిందటి దివిసీమ ఉప్పెన తరువాత, కోస్తా ప్రాంతంలో తుఫానుల నుంచి రక్షణకు ఏంచేయాలన్న ఆలోచన, కొన్ని ప్రయత్నాలు కూడా జరిగాయి. కానీ, ప్రతి ఏటా ఏదో ఒక స్థాయిలో వచ్చే వరదల గురించిన వ్యూహరచన మాత్రం జరగడం లేదు. వరదల తాకిడికి రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. వర్షం తగ్గగానే వాటిని మరమ్మతులు చేయిస్తామని అధికారుల చెబుతున్నారు. మరమ్మతుల విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులతో మంత్రులు ఇప్పటికే చర్చించారు. ఇంకా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్లపై నుంచి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు వాహనాలతో దాటడానికి ప్రయత్నించ వద్దంటున్నారు. గ్రామాల్లో గర్భిణులు, వృద్ధులకు అత్యవసర వైద్య సేవలు అందించడానికి ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందిని అప్రమత్తంగా ఉంచారు. వరుసపెట్టి కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకుతున్నాయి. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రోడ్లు దెబ్బతినడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. రెండు రాష్ట్రాల్లో సహాయక చర్యలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ధవళేశ్వరం ఆనకట్ట కట్టడానికి ముందు ఆ ప్రాంతంలో తరచు గోదావరి నదికి వరదలు వచ్చేవి. తుపాన్లు గోదావరి జిల్లాల ప్రాంతంలో బీభత్సం సృష్టించేవి. సర్‌ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం నిర్మించడం ద్వారా ఆ ప్రాంతంలో విపత్తును నివారించగలిగారు. హైదరాబాద్ నగరంలో 1908లో వచ్చిన మూసీ వరదల తరువాత, అప్పటి నిజాం పాలకుడు, హైదరాబాద్‌కు శాశ్వత వరద నివారణ వ్యవస్థను, మంచినీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేశారు. పాలకుల దూరదృష్టికి ఇవి ఉదాహరణలు. ఇప్పుడు కూడా అనేక ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు. అయితే వరదలను, విపత్తులను దృష్టిలో పెట్టుకుని నిర్మించడంతో పాటు, చెరువులను పునరుద్దరించాలి. పెరుగుతున్న పట్టణీకరణ కారణంగా చెరువులను, కాలువలను మింగేస్తున్నారు. తెలంగాణలో నీటి పారుదల ప్రణాళికను ఇప్పుడిప్పుడే సిఎం కెసిఆర్ ఆధునీకరిస్తున్నారు. చెరువులను పునరుద్దరిస్తున్నారు. నదులను, చెరువులను సంధానం చేయాలన్న వ్యూహంతో సాగుతున్నారు. ఎపిలో కూడా సిఎం జగన్ నీటిపారుదల రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే వర్దలను నివారించేలా కాటన్ స్ఫూర్తిని ప్రదర్శిస్తే మంచిది. ఈ దశలో శాశ్వత చర్యలతో పాటు తాత్కాలికంగా నష్టపోయిన వారిని ఆదుకోవాల్సిందే. అలాగే అన్నదాతలకు పరిహారం అందేలా చేయాలి. అప్పుడే మళ్లీ వారు వ్యవసాయంలోకి దిగాలన్న భరోసాతో ఉంటారు. పంటలు నష్టపోయిన వారిని ఉదారంగా ఆదుకుంటేనే మనకు భవిష్యత్‌తో మళ్లీ అన్నం పెట్టగలరు. అలాగే వర్దలకు కారణమైన ఆక్రమణల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

# రాష్యా స్పుత్నిక్‌పై తొలగని అనుమానాలు

## స్పష్టత ఇవ్వని ప్రపంచ ఆరోగ్య సంస్థ
## భారత్ పరిశోధనలపైనే ప్రపంచం చూపు

మాస్కో,ఆగస్టు 19(ఆర్‌ఎన్‌ఎ): కోవిడ్-19ను ఎదుర్కొనేందుకు రష్యా 'స్పుత్నిక్' టీకాను ప్రకటించినా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇంకా దానిపై స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఎవరు కూడా కరోనాకు వ్యాక్సిన్ వచ్చిందన్న భరోసా లేకుండా పోయింది. రష్యా ప్రకటనతో ప్రపంచ దేశాలకు కొండంత భరోసా వచ్చినట్లయింది. అయితే ఈ టీకా మూడో దశ మానవ ప్రయోగాలకు సంబంధించిన సమాచారంపై స్పష్టత లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) పేర్కొనడంతో టీకా ఫలితాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు దీని ఉత్పత్తి ప్రారంభించడానికి ముందే ఈ వ్యాక్సిన్ కావాలంటూ వివిధ దేశాలు కోట్ల సంఖ్యలో ఆర్డర్లు చేశాయి. అయితే కరోనా వైరస్‌ను అడ్డుకునేందుకు టీకా సిద్ధమైందని రష్యా చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా మిశ్రమ స్పందన కలిగించింది. మూడో దశ మానవ ప్రయోగాలు పూర్తి కాకుండానే స్పుత్నిక్‌ను విడుదల చేయడం ఏమాత్రం సరికాదని, మానవ ప్రయోగాల సమాచా రాన్ని డబ్ల్యూహెచ్‌ఓకు సమర్పించలేదని పలువురు విమర్శలకు దిగగా.. రష్యా మాత్రం తన దారిన తాను ముందుకెళుతోంది. ప్రభుత్వ నియంత్రణ సంస్థల వద్ద టీకా నమోదు పక్రియను పూర్తి చేసి, ఒకట్రెండు వారాల్లోనే ఉత్పత్తి ప్రారంభిస్తామని రష్యా ప్రకటించి ంది. వ్యాక్సిన్‌కు రోగ నిరోధక వ్యవస్థ మెరుగ్గా స్పందిస్తోందని, తన కుమార్తెకు తొలి దఫా టీకా ఇచ్చామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్వయంగా ప్రకటించినా పెద్దగా స్పందన రాలేదు. ఈ క్రమంలోనే టీకాను లాటిన్ అమెరికా దేశాలతోపాటు ఆసియా దేశాలకూ సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు రష్యా ప్రకటించింది. టీకా వేసుకున్న వారిని పరిశీలించేందుకు రష్యా స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్ తయారు చేస్తున్నట్లు సమాచారం. స్పుత్నిక్ టీకాకు చాలా వేగంగా అనుమతులివ్వడం నిపుణులను ఆశ్చర్యపరు స్తోంది. సామర్థ్యం, భద్రత వంటి అంశాల్లో స్పుత్నిక్ ఇప్పటికీ ప్రామాణిక పద్ధతులను పాటించ లేదని కాబట్టి ఈ టీకాను వాడటం సరికాదని వీరు అంటున్నారు. తొలి రెండు దశల ప్రయోగాల్లో భాగంగా దాదాపు వంద మందిపై టీకా పరీక్షించారని, మూడో దశలో వేల మందిపై జరపాల్సిన ప్రయోగాలు చేపట్టనే లేదన్నది వీరి అభ్యంతరం. రష్యా అభివృద్ధి చేసిన టీకాను ఎక్కువ మందిపై పరీక్షించకపోతే దాని సామర్థ్యాన్ని అంచనా వేయడం కష్టమని హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యురల్ బయాలజీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ మిశ్రా తెలిపారు. ఎక్కువ మందిలో టీకా ఎలా పనిచేస్తుందో తెలుసుకునేందుకు మూడో దశ మానవ ప్రయోగాలు అవసరం అని చెప్పారు.

ఈ క్రమంలో పాకిస్తాన్‌కు రష్యా పది లక్షల డోసులు ఉచితంగా ఇవ్వనున్నట్లు సమాచారం వచ్చింది. చైనా తర్వాత ఇప్పుడు రష్యా.. పాకిస్తాన్‌కు 10 లక్షల కరోనా వ్యాక్సిన్లను బహుమతిగా అందిస్తోంది. అయితే ఇది మానవ ప్రయోగాల కోసమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిందంటూ ఫేస్‌బుక్, వాట్సాపుల్లో ప్రచారం సాగింది. అసలు రష్యా ఇంకా వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రారంభించనేలేదు. వచ్చే నెలలో టీకా ఉత్పత్తి ప్రారంభిస్తామని వెల్లడించింది. మరోవైపు పాక్‌కు బహుమతిగా లక్షల డోసులు ఇస్తున్నట్లు ఎక్కడా ప్రకటించనూలేదు, దీనిపై డబ్ల్యూహెచ్‌వో స్పందించనూ లేదు. చైనా అభివృద్ధి చేస్తున్న వ్యాక్సిన్ మూడో దశ ప్రయోగాలను మాత్రం పాకిస్తాన్‌లోనే పరీక్షిస్తున్నట్లు మరో వార్త ప్రచారంలో ఉంది. మొత్తంగా పరిశీలిస్తే మనం చేస్తున్న ప్రయోగాలపైనే ప్రపంచం నమ్మకంగా ఉంది. మనదేశంలో వ్యాక్సిన్ కోసం అంతా ఆతృగా చూస్తున్నారు.

# కరోనాతో కోలుకున్న వారిలో ఇతరత్రా ఆరోగ్య సమస్యలు

## అనేకులకు ఊపిరితిత్తులు, శ్వాస సమస్యలు
## వైద్య నిపుణుల అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్టు19(ఆర్‌ఎన్‌ఎ): చాలా మంది కరోనా నుంచి కోలుకున్నా.. ఆరోగ్య పరంగా అనేక సమస్యలు ఎదుర్కొంట న్నారని తెలుస్తోందంఇ. నెగిటివ్ వచ్చినప్పటికి తిరిగి అనారోగ్యం పాలవుతున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ ప్రభుత్వ అధీనంలోని రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి 'పోస్ట్ కోవిడ్ క్లినిక్'ని ప్రారంభించింది. కరోనా నుంచి కోలుకున్న వారిలో తర్వాత తలెత్తే అనారోగ్య సమస్యలకు చికిత్స అందించడంలో ఈ పోస్ట్ కోవిడ్ క్లినిక్ సహాయపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ బీఎల్ షేర్వాల్ మాట్లాడుతూ.. 'కరోనా నుంచి కోలుకున్న వారిలో వేర్వేరు అనారోగ్య సమస్యలు వెలికి చూస్తున్నాయి. కొందరు దగ్గుతో బాధపడుతుండగా.. మరి కొందరిలో అలసట, నీరసం వంటి లక్షణాలు వెలుగు చూస్తున్నాయి. వేర్వేరు వయసుల వారిలో.. మహిళలు, పురుషుల్లో ఈ సమస్యలు కనిపిస్తున్నాయని అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కరోనా నుంచి కోలుకున్న తర్వాత కూడా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఎయిమ్స్‌లో చేరిన సంగతి తెలిసిందే. కరోనా నెగిటివ్ వచ్చినప్పటికి గత మూడు నాలుగు రోజులుగా ఆయన అలసట, ఒంటి నొప్పులతో బాధపడుతున్నట్లు వెల్లడించారు. కోవిడ్ నుంచి కోలుకున్న తర్వాత తిరిగి అనారోగ్యం పాలవుతున్న వారిలో అమిత్ షా మాత్రమే లేరు. అనేకులు ఇదే సమస్యలు ఎదుర్కొటున్నారు. గత వారం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ.. 'కరోనా నెగిటివ్ వచ్చి ఇంటికి వెళ్లిన కొందరిలో ఆక్సిజన్ స్థాయి పడిపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక మీదట డిశ్చార్జ్ అయ్యే వారికి ఆక్సిజన్ కాన్సన్‌ట్రేషన్స్‌ను ఇవ్వాలని నిర్ణయించాం' అన్నారు. మాజీ మంత్రి కేజే అల్ఫోన్స్ మాట్లాడుతూ.. 'మా అమ్మకి మే 28న కోవిడ్ పాజిటివ్ వచ్చింది. ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. ఆ తర్వాత రెండు సార్లు పరీక్షించిన తర్వాత నెగిటివ్ వచ్చింది. డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చాక జూన్ 11న ఆమె గుండెపోటుతో మరణించింది. కరోనా వచ్చిన వారిలో కొందరికి శరీర వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుంది. మా అమ్మ విషయానికి వస్తే.. ఆమెకు ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్నాయి. గుండెపోటుతో మరణించింది. ఈ వైరస్ శరీరంలోని ముఖ్యమైన అవయవాలను నాశనం చేస్తుంది. దీర్ఘకాలిక ప్రభావాలను చూపిస్తోందని అన్నారు. ఇక ముంబై లోని కొన్ని ఆస్పత్రుల్లో కరోనా నుంచి కోలుకున్న వారిలో 40 శాతం మంది ఊపిరితిత్తుల సమస్యలతో తిరిగి ఆస్పత్రులకు వస్తున్నారు. కొందరిలో పొడి దగ్గు, శ్వాస తీసుకో వడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని అన్నారు. కరోనా వైరస్‌తో ఐసీయూలో చికిత్స పొందిన వారు రెండు వారాల్లో తిరిగి ఇతర సమస్యలతో ఆస్పత్రికి వస్తుండగా.. వార్డులో చికిత్స పొందిన వారు నెల రోజుల్లో తిరిగి ఆస్పత్రికి వస్తున్నారు. వీరు అలసట, ఊపిరితిత్తుల సమస్యలు, గుండె సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు.

# పోలీస్ రిక్రూట్ అభ్యర్థుల చలో డిజిపి ఆఫీస్

## అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,ఆగస్టు19(ఆర్‌ఎన్‌ఎ): టీఎస్‌ఎస్పీకి సెలెక్ట్ అయిన అభ్యర్థులు బుధవారం 'చలో డీజీపీ ఆఫీస్'కు పిలుపునిచ్చారు.

ఈ నేపథ్యంలో డీజీపీ కార్యాలయానికి వచ్చిన తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు సెలెక్ట్ అయిన అభ్యర్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఫలితాలు విడుదలయ్యి దాదాపు 9 నెలల అవుతున్న ఇప్పటి వరకు ట్రైనింగ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అభ్యర్థులు తెలిపారు. తమతో పాటు సెలెక్ట్ అయిన సివిల్, ఏఆర్ అభ్యర్థులకు ట్రైనింగ్ ఇచ్చి వేతనాలు ఇస్తున్నారన్నారు.

కానీ టీఎస్‌ఎస్పీ అభ్యర్థుల ట్రైనింగ్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదని వారు వాపోయారు. శిక్షణ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియక..

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఇప్పటికే చాలా మంది సెలక్ట్ అయిన అభ్యర్థులు చనిపోయారని తెలపారు. డీజీపీ తక్షణమే స్పందించి ట్రైనింగ్ తేదీని ప్రకటించి అభ్యర్థులకు పూర్తి వేతనాలు ఇవ్వాల్సిందిగా వారు డిమాండ్ చేశారు.

# పాన్ ఆధార్ అనుసంధానం తప్పనిసరి

## పాన్‌లో తప్పులను ఉడాన్‌తో సరిచేసుకోవచ్చు

న్యూఢిల్లీ,ఆగస్టు19(ఆర్‌ఎన్‌ఎ): ప్రస్తుతం దేశంలో చాలమంది పాన్ కార్డులను ఉపయోగిస్తున్నారు. ఐటి శృాఖ కూడా దీనిని తప్పనిసరి చేసింది. బ్యాంకుల్లో ఎలాంటి రుణాలకైనా ఇది తప్పనిసరయ్యింది. పాన్‌తో ఆధార్ అనుసంధానం కూడా తప్పనిసరి అయ్యింది. అయితే పాన్ కార్డులో ఏమైనా తప్పులు ఏవైనా ఉంటే సరిచేసుకోవడం ఎలా అన్న సందేహాలకు గాను యాప్‌ను తీసుకుని వచ్చారు. అలాగే పాన్ కార్డు కలిగిన వారు కచ్చితంగా ఒక విషయం తెలుసుకోవాలి. పాన్ కార్డును ఆధార్ కార్డుతో లింక్ చేసుకోవాలి. ఆధార్, పాన్ కార్డులను అనుసంధానం చేసుకోకపోతే రానున్న రోజుల్లో ఇబ్బంది పడాల్సి రావొచ్చు. పాన్ ఆధార్ లింక్ చేసుకోవడానికి వచ్చే ఏడాది మార్చి నెల చివరి వరకు గడువు ఉందని నిపుణులు వెల్లడించారు.

అంతేకాదు కేంద్ర ప్రభుత్వం ఆధార్, పాన్ కార్డు అనుసంధాన గడువును పొడిగిస్తున్నవిషయం అందరికి తెలిసిందే. అందువల్ల ఇప్పటికైనా ఆధార్, పాన్ కార్డులను లింక్ చేసుకుంటే మంచిదని తెలియజేస్తున్నారు. అనుసంధానం లేనిచో తిప్పలు తప్పవు అని హెచ్చరిస్తున్నారు. ఆదాయపు పన్ను శాఖ వెబ్‌సైట్‌కు వెళ్లి ఈ రెండింటిని సులభంగా లింక్ చేసుకోవచ్చునని నిపుణులు తెలిపారు. . పాన్ కార్డు లేదా ఆధార్ కార్డులో వివరాలు తప్పుగా ఉంటే రెండింటినీ లింక్ చేసుకోవడం కుదరదు అని తెలిపారు. అప్పుడు మీరు పాన్ కార్డ్ లేదా ఆధార్‌లో వివరాలను సరిచేసుకోవాలని అన్నారు. పాన్ కార్డులో తప్పులు సరిచేసుకోవాలంటే ఉమాంగ్ యాప్ ద్వారా ఈ పని పూర్తి చేయొచ్చునని తెలియజేశారు. అయితే ఉమాంగ్ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇక డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత రిజిస్టర్ చేసుకొని లాగిన్ అవ్వాలన్నారు. ఇలా లాగిన్ అయిన తర్వాత సెర్చ్ బార్‌లో పాన్ కార్డు అని టైప్ చేసి సెర్చ్ చేయాలని తెలిపారు. ఇప్పుడు మీకు కొన్ని ఆప్షన్లు కనిపిస్తాయని వీటిల్లో పాన్ కార్డు కరెక్షన్ ఆప్షన్ ఎంచుకోవాలని తెలిపారు. తర్వాత మీ వివరాలను మార్చుకోవాలని నిపుణులు వెల్లడించారు.

# కెటిఆర్‌కు పట్టం కట్టే యత్నాలు సాగుతున్నాయా?

## స్వపక్షంలో సంబరాలు...విపక్షాల ఆరోపణలు

హైదరాబాద్,ఆగస్టు19(ఆర్‌ఎన్‌ఎ): కేటీఆర్ సీఎం కావడానికి త్వరలో పట్టాభిషేకం ఉంటుందా? ఇటీవల పరిణామాలు చూస్తుంటే అటువంటి సంకేతాలే ఇస్తున్నాయని హాట్ హాట్‌గా చర్చ సాగుతోంది. మరోవైపు గులాబీ దండులోని ఓ వర్గం ముఖ్యమంత్రి కుర్చీలో కేటీఆర్‌ను కూర్చోబెట్టాలని డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్ వెనుక పార్టీ పెద్దల హస్తం ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో పట్టాభిషేకం వార్తలతో కేటీఆర్ టీమ్ జోష్‌లో కనిపిస్తోందని అంటున్నారు. ఇటీవల బోధన ఎమ్మెల్యే షకీల్ నేరుగా కెటిఆర్‌ను సిఎం చేయాలని కోరారు. గతంలో ఇలా అనేకమంది కెటిఆర్‌కు నాయకత్వం అప్పగించాలని సూచించారు. ఇదంతా కెసిఆర్ ఇష్టానుసారమే జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. కాంగ్రెస్ ఎంపి రేవంత్ రెడ్డి కూడా ఇదే విషయమూ గతంలో అనేకసార్లు ఆరోపణలు చేశారు. ఇప్పుడు సచివాలయం కూడా లేదు కనుక ఇక భయం కూడా పోయి ఉంటుందన్నారు. టీఆర్‌ఎస్ పార్టీలో జరిగే ప్రతి పనికి ముందు ఇలాంటి ముందస్తు వ్యూహం ఉంటుందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. అందరినీ ముందే సిద్ధం చేసి అనుకున్న పనిని చేసేయడం కెసిఆర్ వ్యూహం అని ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన వ్యవహారాలన్నీ గులాబీ పార్టీ ఇలాగే అమలు చేసింది. తాజాగా కేటీఆర్ సీఎం అవుతారనే చర్చ జోరుగా సాగుతోంది. చాలా సార్లు ఇదే చర్చ జరిగినా ఈసారి ఒక అడుగు ముందుకు వేసి సీఎం స్థానంలో ఉండి చేయాల్సిన పనులన్నీ మంత్రి కేటీఆర్ చేస్తుండడంతో ఆయనే సీఎం అవుతున్నారని పార్టీలోని కేటీఆర్ కోటరీ నేతలు ఫుల్ జోష్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో పార్టీలోని అసంతృప్తులకు కేటీఆరే సీఎం అవుతారని పరోక్షంగా చెప్పినట్టేనని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ఇటీవల ప్రగతిభవన్‌లో సమీక్ష చేపట్టడం, వరంగల్ పర్యటన అట్టహాసం అంతా ఇదే కోవలోనిదన్న ఆరోపణలు ఉన్నాయి.



## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

# 'బుధవారం బాద్షా'

## పోటీ ఫలితాలు

నిర్వహణ: **డా॥ప్రతికంఠం మాలతీలత**

ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.



అడ్మిన్: **రమాదేవి కులకర్ణి**
8985613123

అంశం: **నిరుద్యోగి**

### ప్రథమ బహుమతి విజేత

ఎంతసదివిన గానీ లాభమేముందీ
డిగ్రీలెన్ని ఉన్నా ఉపయోగమేముందీ
ఆశ ఎంతో పడ్డా నేనెన్నో కలలు కన్న
బాధతీరలే నా బ్రతుకు మారలే
అరెరే బాధతీరలే నా బతుకు మారలే

అమ్మానాన్న రక్తం సెమటతీసి
పైసా పైసా నాకు ఖర్చుపెట్టి
సదుకో కొడుకాని నన్ను నడిపిస్తే
డిగ్రీలు పీజీలు నేను పూర్తిచేసి
నౌకరి నాకొస్తే కష్టాలు పోతాయి
కన్నోళ్ల కళ్ళల్లో వెలుగులు నింతయి
కలలే కన్నాను కష్టాల్లో నేపడ్డాను

ఎంత సదివినగానీ లాభమేముందీ
డిగ్రీలెన్ని ఉన్నా ఉపయోగమేముంది
ఆశ ఎంతోపడ్డా నేఎన్నో కలలు కన్నా
బాధతీరలే నా బతుకు మారలే

ప్రతిభ ఎంతున్న నౌకరి లేదాయే
డిగ్రీలు నసుజూసి పక్కున నవ్వబట్టే
చేతిలో పనిలేక పూట గడవదాయే
ఇంత సదువూ సదివి నేనేమి జెయ్యలే
నామీద ఆశలు నేనెట్ల తేర్చాలే
అమ్మా నాన్నలను ఎట్ల బతికించాలే
నిరుద్యోగి కల్లల్లో నీరు ఇంకి పోబట్టే

ఎంత సదివిన గానీ లాభమేముందీ
డిగ్రీలెన్ని ఉన్నఉపయోగమేముంది
ఆశ ఎంతోపడ్డ నే ఎన్నో కలలు కన్నా
బాధతీరలే నా బతుకు మారలే



**-మండికారి బాలాజీ**
అచ్చంపేట
నాగర్ కర్నూల్ 509375

### ద్వితీయ బహుమతి విజేత

పల్లవి:: నిరుద్యోగం నీడై వెంటాడుతున్నదీ....
చిరుద్యోగమైనా దరి చేర నన్నదీ.,
డిగ్రీ ఉన్నాగానీబిబి మరి పీజీ అన్నాగానీ..
ఒక్కటి రాదాయే.బిబి.నాబిబి బ్రతుకు చేదాయే...
ఒక్కటి రాదాయేబిబి. ఈబిబి బ్రతుకు చేదాయే ....

చదివీ చదివీ కళ్ళుబి కాయల్లు కాచేనే..
తిరిగీ తిరిగీ కాళ్ళబిచెప్పులరిగి పోయేనే..
మనసేమొ ఊరుకోదు..బిఏ మనిషీ ఆదుకోడు..
నీలాగె నేనంటూబిబి మొత్తుకుంటాడూ....
నీలాగే నేనంటూ మొత్తుకుంటాడూ...

చరణం: సాఫ్టువేరూబిబిచతికిల పడ్డావేళ.,
ఇంజీ నీర్లూబిబిఇంటింటా పుట్టినవేళ....
కంపెనీలూబిబికాదు పొమ్మంటుంటే....
అమ్మానాన్నాబిబి అడుగుతుంటుంటే..
కలలూ కల్లలై, కన్నీరౌతుంటే...

ఎదలో ఏడుపేబివెల్లువ లౌతుంటే...
ఏం చెయ్యాలో తోచకనేనూ
ఎంతో వేదన పడుతుంటే.. ॥నిరు॥

చరణం: నోటిఫికేషన్‌బిబి సర్కారివ్వని వేళ...
ఎండామావైబిబివెక్కిరించిన వేళ
ప్రయివే టేమోబిబిప్రతిభను కాదన్నవేళ..
ప్యాకేజీకై బిబిబ్యాకేజడిగే వేళ..
ఉత్తమ విద్యార్థిబిబిపత్రాలున్ననూ...
ఉత్తరువేలేకబిబిచిత్తరువైనాను..
కాస్తైనాకునుకే పట్టక బి
కళవల పడుతు ఉన్నానూ ...॥నిరు॥



**గుమ్మన్నగారి బాలసరస్వతి,**
సిద్దిపేట...

# అన్న.... రైతన్నా

అన్న.... రైతన్నా
అన్నదాత నీవన్నా
విరామమెరుగని కష్టజీవివి
దేశానికి వెన్నెముకైనోడివి
రైతువునువ్వే రాజువునువ్వే
నోటికాడి మా బువ్వవునువ్వే

వరుణదేవుని కరుణ కోసము
దినమొక యుగమై ఎదురుచూస్తవు
అర్ధరాత్తిరి వానకురియగా
మట్టివాసన నిన్ను తట్టగా

అవధులులేని ఆనందం నిను
నేలతల్లిని చదును కు నడుపగ

చెరువులు మత్తడి దరువులేయగా
కుంటలు బుడుగులు సందడి చేయగా
బురదబువ్వకై గొర్రుకొట్టగా
చెమట చుక్కలే సిరులై పండగ

పంటను బండి మీదికెత్తుతవు
కాయకష్టాన్ని మరచిపోతావు
ప్రేమమూర్తివై త్యాగశీలివై
జైకిసానువై వెలుగొందెదవు



**-సౌరం ప్రవీణ్ కుమార్**
9866198112

# ఓసీ కరోనా రాక్షసీ !

ఓసీ కరోనా రాక్షసీ !
మేమెవరమో తెలుసా ?
మేము భారతీయులం !
వీరులం శూరులం
విప్లవవీరులం విశ్వవిజేతలం
నీ భరతం పట్టేందుకు సిద్దంగా వున్న
అల్లూరి సీతారామరాజులం.

ఓసీ కరోనా పిశాచి !
మేమెవరమో తెలుసా ?
మేము భారతీయులం !
కండబలం గుండెబలం వున్నవాళ్ళం
పుష్టికరమైన ఆహారం తీసుకొని
షష్టి పూర్తి చేసుకునే వాళ్ళం.

ఓసీ కరోనా కాలసర్పమా !
మేమెవరమో తెలుసా ?
మేము భారతీయులం !
పచ్చని ఆకుకూరలు పండ్లు ఫలాలే
మాకు ఔషధాలు
మంచి అలవాట్లే మా ఆయుధాలు.

ఓసీ కరాళనృత్యం చేసే
ఓ కరోనా మృత్యువా !
నీకు భయపడి మేము ఇంటిలో
దొంగల్లా దాక్కున్నామని
ఇకిలి నవ్వులు నవ్వకు
వెకిలి చేష్టలు చేయకు
వేధించకు, వెంటపడకు.

కంటబడితే, కసిదీరా
కాలసర్పమై కాటువెయ్యాలని,
కబళించాలని, కాటికీడ్చాలని,
కలలు కనకు,నీ కలలు కల్లలౌతాయి
రాక్షస ప్రణాళికలేవీ రచించకు
అవి నీటి మీద రాతలౌతాయి
రాలిపోయే ఆకులౌతాయి.

ఓసీ కరోనా మాయదారి మహమ్మారీ!
నీకు మందు కనిపెడతాం
నీకు బొంద పెడతాం
ఇక నీకు త్వరలోనే శిక్ష వేస్తాము



**-పోలయ్య కవి కూకట్లపల్లి**
9110784502







కిన్నెర ఆర్ట్ థియేటర్స్,
నేటినిజం తెలుగు దినపత్రిక,
మరియు
పి.వి.మనోహరరావు గారి
సౌజన్యంతో
భారత పూర్వ ప్రధాని పి.వి.నరసింహారావు గారి
శత జయంతి సందర్భంగా




పి.వి.నరసింహారావు
జీవితం- వ్యక్తిత్వం- సాహిత్యం ఇతివృత్తంగా

వ్యాస రచనల పోటీ

ఉత్తమ బహుమతి : రూ.5000/-
ద్వితీయ బహుమతి : రూ.3000/-,
తృతీయ బహుమతి : రూ.2000/-

- రచనలు ఎ4 సైజు పేపరులో 4 పేజీలు తగ్గకుండా/ మించకుండా ఉండాలి.
- వ్యాసాలు ఏ పత్రికలో ప్రచురించలేదని సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని, ఈ పోటీ నిమిత్తమే వ్రాసినదని, హామీ పత్రం జతచేయాలి.
- హామీ పత్రంలో మీ పేరు, ఫోటో, పూర్తి చిరునామా, సెల్ నెం.తప్పనిసరి.

రచనలు పంపవలసిన చిరునామా:
నేటినిజం దినపత్రిక,
ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్,
అశోక్‌నగర్, హైదరాబాద్-20
netinizam2020@gmail.com

రచనలు పంపవలసిన చివరి తేది
30-09-2020

